నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 13

మంగళవారం, అక్టోబర్ 07, 2025 , పేజీలు - 12 వెల: 2/-

# హైకోర్టులో తేల్చుకోండి



## బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ కొట్టివేత

**సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట**

**హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేం**

**సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,అక్టోబర్6:** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. మిగతాది 2లో...

## తీర్పు శుభ పరిణామం

**42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం**

**ఢిల్లీలో మీడియాతో మంత్రులు భట్టి, పొన్నం**



2లో

# సీజేఐపై బూటుతో దాడికి యత్నం..

## న్యాయవాది వేషంలో వచ్చి వస్తువు విసిరేందుకు ప్రయత్నించిన వ్యక్తి



2లో

సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి విఫలయత్నం

వెంటనే అడ్డుకుని బయటకు తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది

ఘటనను తీవ్రంగా ఖండించిన ప్రధాని మోదీ

సంయమనం పాటించిన సీజేఐని ప్రశంసించిన ప్రధాని

దుశ్చర్యపై సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం

# మావోయిస్టు పార్టీలో కలకలం

## : పొలిట్ బ్యూరోకు అగ్రనేత మల్లోజుల రాజీనామా



**ఉద్యమాన్ని కాపాడలేకపోయినందుకు క్షమాపణలు**

**అనవసర త్యాగాలకు ముగింపు పలకాలని సూచన**

**పార్టీ అధికార ప్రతినిధి జగన్‌పై విమర్శలు**

**హైదరాబాద్,అక్టోబర్ 6:** మావోయిస్టు పార్టీలో పెను ప్రకంపనలు రేగాయి. ఆ పార్టీ అగ్రనేత, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. సాయుధ పోరాటాన్ని విరమించాలని క్యాడర్‌కు పిలుపునిస్తూ ఆయన రాసిన లేఖ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొన్ని అనివార్య కారణాల వల్ల, ఈ పదవిలో కొనసాగే అర్హత తనకు లేదని భావించి పార్టీని వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# పరిశ్రమలు పెట్టే వారికి అన్ని రకాల మద్దతు

## హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ అంగీకారం

**రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ నిర్ణయం**

**సిఎం రేవంత్‌తో పరిశ్రమ ప్రతినిధుల భేటీ**

**హైదరాబాద్,అక్టోబర్ 6:** తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిన్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. మిగతాది 2లో...



# రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలకు నోబెల్

**వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన నోబెల్ బహుమతి**

**మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రతిష్ఠాత్మక పురస్కారం**

**ఈ నెల 13 వరకు కొనసాగనున్న నోబెల్ బహుమతులు**




**హైదరాబాద్,అక్టోబర్ 6:** వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది.

# మీ బకాయిలు మేం చెల్లిస్తున్నాం

**మీరు పనులు వదిలి వెళితే మేం చేస్తున్నాం -శరవేగంగా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం**

**హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,అక్టోబర్ 6**

మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మిస్టర్ హరీష్ రావు.. మీలాగా మాటలు కాదు, చేతల ప్రభుత్వం మాది అని విమర్శించారు. విద్యా, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నాం అని, శంకుస్థాపన స్థాయిలో వదిలి వెళ్లిపోయిన హాస్పిటల్స్ ఈ 21 నెలల్లో వేగంగా నిర్మిస్తున్నాం అని అన్నారు. మీ ప్రభుత్వం 40 వేల కోట్ల బకాయి పెట్టిపోతే.. తాము చెల్లిస్తున్నాంఅని మండిపడ్డారు. నిత్యం మా ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నాను అనిమిగతాది 2లో...



# నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక...

**జూబ్లీహిల్స్ సహా పలు రాష్ట్రాల్లోని ఉపఎన్నికలకు షెడ్యూల్ విడుదల**

**13న ఉపఎన్నిక నోటిఫికేషన్, 21 వరకు నామినేషన్**

**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,92,669 ఓటర్లు**




2లో

# రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ... కటింగ్ మాస్టర్

**: రేవంత్‌పై హరీశ్ రావు సెటైర్లు**

**కేసీఆర్ పనులకు రిబ్బన్లు కట్ చేయడమే రేవంత్ పని అని ఎద్దేవా**

**హైదరాబాద్,అక్టోబర్ 6:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాదని, ఆయనో 'కటింగ్ మాస్టర్' అని ఘాటుగా మిగతా 2లో...



# రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడిన జస్టిస్ వి.గోపాల గౌడ

**వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం**

**గోపాలగౌడ తీర్పులు చారిత్రాత్మకం**

**చింతామణిలో గౌడ పుస్తకావిష్కరణలో పవన్ కల్యాణ్**

**బెంగళూరు,అక్టోబర్ 6:** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడ మట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ అని మిగతాది 2లో...



# సీజేఐపై బూటుతో దాడికి యత్నం..




దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం తీవ్ర కలకలం రేగింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ పైకి ఓ వ్యక్తి బూటు విసిరేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన జస్టిస్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా, న్యాయవాది దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి అనూహ్యంగా ధర్మాసనం వైపు దూసుకొచ్చాడు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పైకి తన పాదరక్షను విసిరేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకుని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆ వ్యక్తి 'సనాతన ధర్మం' గురించి నినాదాలు చేసినట్లు సమాచారం.ఈ అనూహ్య ఘటనతో విచారణకు కొద్దిసేపు అంతరాయం కలిగినా, సీజేఐ జస్టిస్ గవాయ్ ఏమాత్రం చలించలేదు. "ఇలాంటి వాటివల్ల మన ఏకాగ్రత దెబ్బతినకూడదు. మేం చలించం. ఇవి నన్ను ప్రభావితం చేయలేవు" అని వ్యాఖ్యానించి విచారణను కొనసాగించారు. ఆ తర్వాత, దాడికి యత్నించిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, ఆ విషయాన్ని విస్మరించాలని ఆయన సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. "సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రతి భారతీయుడినీ ఆగ్రహానికి గురిచేసింది. ఇలాంటి నీచమైన చర్యలకు మన సమాజంలో చోటు లేదు. ఇది తీవ్రంగా ఖండించదగింది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జస్టిస్ గవాయ్ ప్రదర్శించిన సంయమనాన్ని ప్రశంసించారు. ఇది న్యాయ విలువల పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తోందని అభినందించారు.మరోవైపు, ఈ దుశ్చర్యను సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ (స్కోరా) ఏకగ్రీవ తీర్మానంతో ఖండించింది. న్యాయవాద వృత్తికే అవమానకరమైన ఈ చర్య, న్యాయస్థానం గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

# పరిశ్రమలు పెట్టే వారికి అన్ని రకాల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

రూ.9 వేల కోట్లతో ఎ÷-లాంటు, క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను సీఎం అభినందించారు.ఫార్మా పాలసీని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు. తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలిలిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్షరింగ్ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుకు ఒక బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. దీంతో ఎలిలిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలిలిల్లీ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎంతో పాటు ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలిలిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎలిలిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ



పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలిలిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎలిలిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది.

ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలిలిల్లీ కంపెనీ కార్యకలాపాలు ఉన్నాయి.హైదరాబాద్ లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మ హబ్గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1965లో ఇందిరా గాంధీ హైదరాబాద్‌కు ఐడీపీఎల్ తీసుకు వచ్చినప్పటి నుంచి ఫార్మా రంగం విస్తరించిందని అన్నారు. పేరొందిన దిగ్గజ ఫార్మా కంపెనీలుండటంతో 40 వాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు.

# హైకోర్టులో తేల్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్- 9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## తీర్పు శుభ పరిణామం

సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వి వాదనలు గట్టిగా వినిపించారన్నారు. అంతకు ముందు మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. ఇందిరా సహానీ కేసు తీర్పు ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్లు కల్పించవచ్చన్నారు. సిపెక్ సర్వే ద్వారా సమగ్రమైన జన గణన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా.. బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో జరిగే వాదనలు సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కోర్టుకు హాజరయ్యారు. సుప్రీం తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడిన జస్టిస్ వి.గోపాల గౌడ

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. డబ్బు కోసం కాకుండా సగటు ప్రజలకు న్యాయం చేసేందుకు గోపాలగౌడ వచ్చారని ఉద్ఘాటించారు. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని ప్రశంసించారు. ఎన్నో కీలక కేసుల్లో గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకమని ఉద్ఘాటించారు. సోమవారం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో పవన్ కల్యాణ్ పర్యటించారు. గోపాల గౌడ 75వ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. గోపాలగౌడ రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్



ఆవిష్కరించారు. పవన్‌ని చూడటానికి అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ప్రసిద్ధ కవి కుప్పలి వెంకటప్పను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భగా పవన్ మాట్లాడుతూ...పదవిలో ఉన్నప్పుడు ఎలా ఉండాలి, పదవి తర్వాత ఎవరి కోసం జీవించాలో గోపాలగౌడ ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడే వారి పక్షాన గోపాలగౌడ నిలిచారని ప్రశంసించారు. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలు చేసినా ఎదురు నిలిచారని చెప్పు కొచ్చారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో గౌపాలగౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు పవన్ కల్యాణ్. 'రాజ్యాంగాన్ని కాపాడే విషయంలో గోపాలగౌడ యువ న్యాయవాదాలకు దిశానిర్దేశర చేశారు.

# రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలకు నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

వైద్య విభాగంతో ప్రారంభమైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి.మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకు గాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలుగా పేర్కొనబడే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు తమ పరిశోధనలు గుర్తించారు.

# మావోయిస్టు పార్టీలోకలకలం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఆయన ఓ లేఖ విడుదల చేశారు. పార్టీ ఇప్పటివరకు అనుసరించిన పంథా పూర్తిగా తప్పని, దీనివల్ల ఉద్యమం తీవ్రంగా నష్టపోయిందని అంగీకరించారు. ఉద్యమాన్ని ఓటమి పాలుకాకుండా కాపాడలేకపోయినందుకు తాను క్షమాపణలు కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం ఒక టీకా లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు.ఆయుధాలు వీడాలనే నిర్ణయంపై పార్టీలో అంతర్గతంగా చర్చ జరిగిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జీవించి ఉన్నప్పుడే ఈ అంశంపై చర్చ జరిగిందని గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో సాయుధ పోరాటం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేమని స్పష్టం చేశారు. అనవసర త్యాగాలకు ఇకనైనా ముగింపు పలికి, పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని క్యాడర్‌కు ఆయన సూచించారు.

# నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక...

తెలంగాణ రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. తెలంగాణతో సహా వివిధ రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది.ఈ నెల 13న ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 వరకు గడువు ఉంది. నామినేషన్ల పరిశీలన ఈ నెల 22న చేపట్టనుండగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు అక్టోబర్ 24. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.తెలంగాణతో పాటు జమ్ము కశ్మీర్, ఒడిశా, ఝార?ండ్, మిజోరాం, పంజాబ్, రాజస్థాన్ లో కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలు, ఫలితాలు ఒకే రోజు వెలువడనున్నాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు.


# రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ...
# కటింగ్ మాస్టర్

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. జేబులో ఎప్పుడూ కత్తెర పెట్టుకుని తిరుగుతూ, కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్లు కత్తిరించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఒకవేళ రిబ్బన్లు కత్తిరించకపోతే, కేసీఆర్ అమలు చేసిన పథకాలను కత్తిరించడమే రేవంత్ పని అని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని పదేపదే చెబుతున్న సీఎం రేవంత్, అదే ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ నగరానికి నీటిని ఎలా తరలిస్తున్నారని హరీశ్ సూటిగా ప్రశ్నించారు. "కేసీఆర్ చెమటోడ్చి నిర్మించిన ప్రాజెక్టు కాళేశ్వరం. మరి మల్లన్నసాగర్‌ను మీ నాన్న కట్టారని నీళ్లు తీసుకెళుతున్నారా?" అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని చెప్పినా ప్రజలు ఇక నమ్మే స్థితిలో లేరని ఆయన అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కొత్తగా పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న రెండు లక్షల పింఛన్లను తొలగించారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి పథకం కింద 8 లక్షల తులాల బంగారం లబ్ధిదారులకు బాకీ పడ్డారని తెలిపారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి 20 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని, ఎన్నికల ముందు రజినీకాంత్‌లా కనిపించిన రేవంత్, అధికారంలోకి వచ్చాక 'గజినీకాంత్'లా హామీలను మర్చిపోయారని సెటైర్లు వేశారు. రైతులకు కనీసం యూరియా సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వమని దుయ్యబట్టారు.ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలపైనా హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. "వడ్లకు ఒక నీతి, గోధుమలకు మరో నీతా?" అని కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ము తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఉందా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తే, వాటన్నింటినీ పింక్ బుక్కులో రాసిపెట్టుకుంటున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే వారి సంగతి చూస్తామని హెచ్చరించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అన్ని జిల్లాల్లోనూ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మీ బకాయిలు మేం చెల్లిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)



రేయింబవళ్లు పనులు వేగంగా జరుగుతున్నాయని కోమటిరెడ్డి చెప్పకొచ్చారు. 'సనత్ నగర్ టిమ్స్ అక్టోబర్ 31కి ప్రారంభిస్తామని ఇప్పటికే చెప్పాం. అల్వాల్ హాస్పిటల్ వద్ద 1000 మంది ఒకే షిఫ్టులో పని చేస్తున్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తాం. ఎల్బీనగర్ వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తెస్తాం. నిమ్స్ హాస్పిటల్ 2 వేల కోట్లతో నిర్మిస్తున్నాం, వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. వరంగల్ హాస్పిటల్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తాం. ఎలక్షన్స్ వచ్చాయి కాబట్టి రాజకీయం కోసం పొలిటికల్ విజిట్స్ చేశారు. ప్రజల మేలు కోసం మేము చిత్త శుద్ధితో పనిచేస్తున్నాం' అని హరీష్ రావును ఉద్దేశించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనంను మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'సుమారు 8 కోట్ల వ్యయంతో కార్పోరేట్ స్థాయి హంగులతో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నిర్మించాం. త్వరలో డిజిటల్ క్లాస్‌తో పాటు ఏసీ రూంలు ఏర్పాటు చేయనున్నాం. ఈ పాఠశాల తెలుగు రాష్టాల్లో్ కెల్లా బెస్ట్ మోడల్ స్కూల్‌గా నిలవనుంది. విద్యకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది.

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
మంగళవారం, అక్టోబర్ 07, 2025



# గందరగోళంగా ఎన్నికల షెడ్యూల్

- పార్టీలు ఒత్తిడికి గురయ్యే అవకాశం
- రాష్ట్రంలో బీజేపీని ఓడించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**ఎన్నికల కమిషన్ విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ చాలా గందరగోళంగా ఉందని, ఇది పార్టీలను చాలా ఒత్తిడికి గురి చేసే విధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బిజెపిని ఓడించాలని, బిజెపియేతర పార్టీలతో సంప్రదిపులు, కలిసి వచ్చేటటువంటి పార్టీలతో కలిసి ప్రయాణం చేస్తామని, ప్రధానంగా వామపక్ష. కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సోమవారం కొత్తగూడెం సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం అనుసరించే రాజకీయ విధానం, వైఖరిని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు వివరించారు. నామినేషన్‌లో స్క్రూటినీ, గుర్తుల కేటాయింపు, ప్రచారం, ఒకటి ముగియకముందే మరొకటి ప్రారంభమవుతున్నందున పార్టీలు ఒత్తిడికి గురి అయ్యే అవకాశం ఉందన్నారు. ఎన్నికల షెడ్యూల్ పైన పలు అనుమానాలు, చర్చలు సాగుతున్నాయని, హైకోర్టు తీర్పు ఆధారంగా ఎన్నికలు జరుగుతాయనే చర్చ ప్రధానంగా సాగుతున్నా ఎన్నికల కమిషన్ షెడ్యూలు ఆధారంగా ఎన్నికలు తప్పనిసరిగా జరుగుతాయి కాబట్టి సిపిఎం పార్టీ రాజకీయ విధానంపై పార్టీ రాష్ట్ర కమిటీ 4వ తేదీన హైదరాబాదులో సమావేశమైనట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల కమిటీల అభిప్రాయాలు తీసుకొని ఒక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీకి కీలకమైనటు వంటిదని, జిల్లా పరిషత్ చైర్మన్ జనరల్ రావడం సరైంది కాదనేది సిపిఎం అభిప్రాయమన్నారు. ట్రైబల్ లేదా 40% ఉన్న బీసీలకు కేటాయిస్తే బాగుండేదన్నారు. రొటేషన్ పద్ధతిన కేటాయించారా.. లేక ఏ ప్రాతిపదికన జిల్లా పరిషత్ చైర్మన్ జనరల్ కేటాయించారనే విషయం అర్థం కావటం లేదని చెప్పారు. సిపిఎం పార్టీ రాజకీయ విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పొత్తులు ఏ పార్టీతో ఉండాలి, ఉండకూడదనే దానిపై చర్చ జరిగినప్పుడు ఒంటరిగా కాకుండా కలిసి వచ్చే పార్టీలతో, లౌకిక ప్రజాతంత్ర శక్తులతో, వామపక్షాలతో కలిసి ప్రయాణం చేయాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఎవరు సిపిఎం పార్టీకి ప్రాధాన్యత ఇస్తారో వారితో కలిసి ముందుకు వెళ్తామన్నారు. మొత్తం 471 పంచాయతీల్లో 128 పంచాయతీల్లో , ఎంపీటీసీలు 238 ఎంపీటీసీలకు 8 ఎంపీపీలు, 6 జడ్పిటిసిలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అభ్యర్థులను ఫైనల్ చేస్తున్నామని, టెక్నికల్ గా ఉన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నీతి, నిజాయితీగా పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేస్తారని మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు.

## స్థానిక పోరులో కలిసొచ్చే పార్టీలతో పొత్తు

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్



**చర్చ, సత్తుపల్లి:**స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఎం సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సిద్ధారం గ్రామ శాఖ సమావేశం రేసు లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి మినహా కలిసి వచ్చే అన్ని పార్టీలతో ఎన్నికల అవగాహన పొత్తులు, సీట్ల సర్దుబాట్లు ఉంటాయని, లేని పక్షంలో ఒంటరిగానే జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎన్నికల బరిలో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు యలగం కృష్ణయ్య, యలగం రాములు, రేగుల గంగులు, మారుతి నారాయణ, రమాదేవి, తోటకూర నారాయణమ్మ, వాసం వెంకటరమణ, రాయిని ఆదినారాయణ, గురువింద రాజయ్య, జమ్ముల రాఘవులు, మంగమ్మ, తిరుపతమ్మ, సుధారాణి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పలకు మండల దీక్ష అన్న ప్రసాద వితరణ

- శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప దేవాలయ కమిటీ





**చర్చ, సత్తుపల్లి:**పట్టణంలో కొలువై ఉన్న శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయం నందు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అయ్యప్పమాల ధరించిన అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ అదులు దోసపాటి అమరలింగేశ్వరరావు తెలిపారు. సోమవారం 76 మంది భక్తులు ఆయలంలో అయ్యప్ప దీక్ష మాలాధారణ చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున గణపతి హెూమం, అయ్యప్పస్వామి పంచామృతాభిషేకం నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకులు వెంకట సురేష్ భక్తులకు అయ్యప్పమాల ధరింప చేశారు. అధ్యక్షులు దోసపాటి అమరలింగేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ సమావేశంలో అక్టోబర్ 16వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు దీక్షాదారులకు నిత్య అన్న ప్రసాదం (బిక్ష) ఏర్పాటు చేయిటకు తీర్మాణించారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, మాజీ అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, సభ్యులు రావి నాగేశ్వరరావు, మామిళ్ళపల్లి హరిబాబు, దురిశేటి శ్రీనివాస్, గుడిమెట్ల సోమేశ్వరరావు, ఇమ్మనేని శ్రీనివాస్, పోలిశెట్టి శ్రీ శివకుమార్ పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్లు సీజ్ ఇద్దరిపై కేసు నమోదు




**చర్చ, సత్తుపల్లి :**ఖమ్మం జిల్లాలో కల్లూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేయడంతోపాటు ఇద్దరు వ్యక్తులపై కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణకు ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక లోడ్‌లతో రెండు ట్రిప్పర్లు వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న కల్లూరు పోలీసులు సోమవారం ఉదయం వాటిని అడ్డుకుని 90 టన్నుల ఇసుకతో సహా రెండు టిప్పర్లను సీజ్ చేశారు. వాహన డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్లో అనుమతి తీసుకుని అక్కడే అమ్మితే టన్నుకు కేవలం రూ.600 మాత్రమే వస్తున్నాయని, ఆంధ్రాకి సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోకి తీసుకువెళ్తే అక్కడ టన్నుకి రూ.1500 నుండి రూ.2 వేలు వస్తాయనే ఆశతో కల్లూరు మీదుగా తెలంగాణలోకి ప్రవేశించినట్లు చెప్పారు. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లు, సుమారు 90 టన్నుల ఇసుకను సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసమే ఎన్నికలకు కాలయాపన


- డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య
- ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్



**చర్చ, మణుగూరు:**ఎన్నికలు రాకపోవడానికి కారణం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొన్ని డిక్లరేషన్లు కారణమని, దానిలో భాగంగా బీసీలకు 42% డిక్లరేషన్ ఇచ్చిందని, బీసీ లకు రిజర్వేషన్ ఇచ్చిన తర్వాత ఎన్నికలకు వెళదామని ఉద్దేశంతో ఈ ఎన్నికలు కాలయాపన జరిగినట్లు ఈ డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య తెలిపారు. మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో సోమ వారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపిటిసి స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావాహుల నుంచి జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ సెల్ ఏర్పాటు చేసి శాసనసభలో బిల్లు ప్రవేశపెడితే కేంద్రంలో బిజెపి బిల్లును అడ్డుకుంటుందని ఆరోపించారు. బిల్లును అడ్డుకొనే ప్రయత్నంలో ప్రత్యేక జీవో తీసుకువచ్చి ఎలాగైనా బీసీ సోదరులకు 42% రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నికలకు ముందుకెళ్తే కోర్టులో పిటిషన్లు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కోర్టులలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికలు జరగాలని కృత నిశ్చయంతో ముందుకెళ్తుందన్నారు. ఈ సమావే శంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, చంద లింగయ్య దొర, నాగ సీతారాము లు,అన్నిమండలాలసీనియర్ నాయకులు, మండల పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు షార్ట్ ఫాల్ పెనాల్టీపై స్పష్టతనివ్వాలి

- ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎస్ఓ టు జిఎం శ్రీనివాసాచారికి వినతిపత్రం




**చర్చ, మణుగూరు:**సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సంబంధించిన అపరాధ రుసుము (షార్ట్ ఫాల్ పెనాల్టీ)పై సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో కాంటాక్ట్ కార్మికులు సోమవారం మణుగూరు ఏరియా ఎస్ఓటు జిఎం బి.శ్రీనివాసాచారి, కొండాపురం సిఎస్‌పి డీజీఎం వి.మదన్ నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిఎల్‌బికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్‌డి. నాసర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు అనారోగ్య కారణాలు, మరేదైనా అత్యవసర పరిస్థితులలో విధులకు గైర్హాజరు అయితే పెనాల్టీ విధించేవారని, కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల ఆందోళనల ఫలితంగా సింగరేణి యాజమాన్యం స్పందించి అపరాధ రుసుములు (షార్ట్ ఫాల్ పెనాల్టీ) రద్దు చేసినట్లు గుర్తుచేశారు. కానీ మరళా పెనాల్టీ విధిస్తున్నారని, పెనాల్టీ సొమ్ము సంబంధిత కాంట్రాక్ట్ కార్మికులు నేరుగా కాంట్రాక్టర్ల చేతులకు చెల్లిస్తేనే జీతాలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తున్నారనీ ఆరోపించారు. సింగరేణి లాభాల వాటాకు సంబంధించి స్పెషల్ ఇన్సెంటివ్‌గా చెల్లిస్తున్న రూ.5,500 ఇంకా కొన్ని సెక్షన్ల కు చెందిన కాంటాక్ట్ కార్మికులకు బ్యాంకు ఖాతాలలో జమ కాలేదని, వారికి కూడా త్వరితగతిన జమ అయ్యే విధంగా తగు చర్యలు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ ఏరియా నాయకులు సాధనపల్లిఐఎఫ్‌టియు నాయకులు వెంకటేశ్వర్లు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికకు దారి ఇవ్వాలని ఆందోళన





**చర్చ, వైరా:**మున్సిపాలిటీ పరిధిలోగల హనుమాన్ బజార్ ప్రజలకు సంబంధించిన శ్మశానవాటికకు వెళ్లేందుకు అవసరమైన దారిని ఆక్రమించి తమను అడ్డగిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు సోమవారం స్మశాన వాటిక ముఖద్వారం ఎదుట ఆందోళనకు దిగారు. కొన్నేళ్ల క్రితం దారికి హద్దులు నిర్ణయించి రాళ్ళు పాతినా చర్యలను ఆక్రమణ దారుడు ఆ రాళ్ల పీకేసి ప్రజలను శ్మశాన వాటికకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కొణిజర్ల తహశీల్దార్ నారపోగు అరుణ, వైరా ఎస్ఐ పి.రామారావు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అనంతరం వివాదాస్పద దారిని కూడా పరిశీలించారు. వారంలో ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రయత్నిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. సంబంధిత స్థలం కొణిజర్ల మండల పరిధిలో ఉండగా ప్రజలు మాత్రం వైరా మున్సిపాలిటీ పరిధిలో ఉన్నారు. అధికారులు సమన్వయంతో ఈ సమస్యకు వారం రోజుల్లో పరిష్కారం చూపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎట్టకేలకు తహశీల్దార్ అరుణ, ఎస్ఐ రామారావుల హామీ మేరకు వారం రోజుల్లో ఉన్నత అధికారులతో, ప్రజాప్రతిధులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆంధోళనకారులు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ బత్తుల గీత, దేవల గోవిందరావు, బత్తుల శ్రీను, వల్లపు రాము, పల్లపు కొండలు, వేముల రవి, వేముల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 8వ తేదీ లోపు బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు దాఖలు చేయాలి: కలెక్టర్



**చర్చ, ఖమ్మం:**స్థానిక సంస్థల బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఈనెల 8వ తేదీ లోగా టెండర్లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డర్ ఇచ్చిన 4 రోజులలోపు బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేయాలని, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన సింబల్ బ్లాక్స్, పింక్, వైట్ పేపర్ మొదలైనవి సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆసక్తి గల వారు జెడ్పి సీఈఓ వద్ద రూ. 5 వేల డిడి చెల్లించి టెండర్ ఫారం తీసుకోవాలని, ఆసక్తి గలవారు 50 వేల రూపాయల డిడితో కలిపి టెండర్ ఫారం అక్టోబర్ 8వ తేదీ లోపు సమర్పించాలని, అదేరోజు సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో టెండర్ తెరవడం చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రైస్ మిల్లర్లు నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి

- జిల్లా కలెక్టర్ ఎం. హరిత
- ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం





**చర్చ :- కరీంనగర్ రాజన్న సిరిసిల్ల** రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో వరి ధాన్యం సేకరణ, బ్యాంక్ గ్యారెంటీ, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం హరిత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు సీఎంఆర్ సరఫరా చేయాలని ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ నెల మూడో వారంలో జిల్లాలో వరి కోతలు మొదలు కానున్నాయని తెలిపారు. ఈ సీజన్లో జిల్లాలో దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లులకు ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు.పలువురు రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్సీఐకి బియ్యం ఇచ్చేందుకు బెడ్స్ ఇప్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించగా, ప్రభుత్వ నిబంధవల ప్రకారం మిల్లర్లకు సహకరిస్తామని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**- నియోజకవర్గ ఇన్ చార్జి యర్రా బాబు**



**చర్చ, వైరా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ యర్రా బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం స్వర్ణ రమేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ అన్ని మండలాలపరిధిలో ఉన్న ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయాలని, కలిసి వచ్చే పార్టీలుతో పోటీ చేయాలని ఆయన సూచించారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారిని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అధికంగా గెలిపించుకొని పూర్వవైభావాన్ని తీసుకురావాలని, తద్వారా నియోజకవర్గం అభివృద్ధి, గ్రామాల అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, జిల్లా సమితి సభ్యులు గడల భాస్కర్, యామాల గోపాలరావు, ఉంగరాల సుధాకర్, మణిగ కోటేశ్వరరావు, పాపగంటి సుదర్శన్, తాత వెంకటేశ్వరరావు, బానోత్ దల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తి పై దాడి హేయమైన చర్య

**- న్యాయమూర్తిపై దాడి పట్ల ఖండన**

**- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తూమని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయవాది యెర్రా కామేష్ అన్నారు.సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ న్యాయవ్యవస్థ గౌరవం కోసం ప్రజలు,సామాజిక ఉద్యమ కారులు అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన అమానుష దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు,మొత్తం న్యాయవ్య వస్థపై,న్యాయ స్వాతంత్ర్యంపై , రాజ్యాంగ విలువలపై జరిగిన ఘోర దాడి అని మేము ఖచ్చితంగా భావిస్తున్నామని,ఈ దుశ్చర్య న్యాయవృత్తి గౌరవాన్ని దెబ్బతీయడానికి, న్యాయస్వా తంత్ర్యాన్ని క్షీణింపజేయడానికి చేసిన కుట్రగా భావించాలని,మేము దీనిని కఠినంగా ప్రతిఘట ిస్తున్నామన్నారు. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడటం మనందరి కర్తవ్యమని ప్రజలందరూ న్యాయవ్యవస్థను విశ్వసిస్తూ ప్రజలందరూ నిరసన తెలపాలని కోరారు.న్యాయమూర్తులపై దాడి అంటే,న్యాయం, రాజ్యాంగం,ప్రజాస్వామ్యం పై దాడి.అందువల్ల,న్యాయవృత్తి గౌరవం రక్షణలో మనమందరం ఏకమై నిలుద్దామని,మతోన్మాదుల దుశ్చర్యలు నశించాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రతి నెల వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి



**చర్చ, ములకలపల్లి:** గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. సోమవారం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ మండల అధ్యక్షులు చిక్కుల శ్రీను మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ఉరితాడులా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, కోశాధికారి రుక్మధరావు, మేకల రమేష్, పసుపులేటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అంతా శుభమే జరుగుతుంది

**- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**



**చర్చ, పాల్వంచ:** అమ్మ దయ ఉంటే అంతా శుభం జరుగుతుందని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బోల్లోరిగూడెం భద్రకాళి యూత్ ఆధ్వర్యంలోని నిర్వహించిన శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు మనందరికీ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు పత్యం సురేష్, సింగారపు రమేష్, సత్తెనపల్లి శ్రీనాథ్, ఇమ్మడి సాయికుమార్ బ్రదర్స్, బాడిషా శంకర్ రావు, మాజీ జెడ్పిటిసి యర్రంశఎట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, శనగ రామచందర్, అశ్విన్, సమ్మిడి జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 8న టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహణ.

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**చర్చ:- కరీంనగర్. పెద్దపల్లి జిల్లా**

జిల్లాలోని నిరుద్యోగ యువకులకు టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 8న బుధవారం రోజున ఎంపీడీవో ఆవరణలోని టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ కాంటెంట్ మోడరెటర్ ,అనలిస్ట్ పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ, బీటెక్ లేదా పిజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్త్రీ పురుషులు దరఖాస్తు తీసుకువచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 8న సంబంధిత సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో పాటు రేస్ యుమ్ తీసుకొని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల టాస్క్ సెంటర్ నందు నిర్వహించే జాబ్ మేళా లో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 9059506807 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో తెలిపారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సజావుగా నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లాలో జరగబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు వివిధ విభాగాల నోడల్ అధికారులను నియమించామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలో సమన్వయంతో పనిచేసి, విధి నిర్వహణలో ఎటువంటి లోపం చోటుచేసుకోకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడం అందరి బాధ్యత అని కలెక్టర్ సూచించారు.జిల్లా స్థాయిలో వివిధ కార్యకలాపాలకు క్రింది అధికారులు నోడల్ అధికారులుగా నియమితులయ్యారు: మానవ వనరుల నిర్వహణకు – బి. నాగలక్ష్మి, జిల్లా విద్యా అధికారి బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణకు – జె. నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి రవాణా నిర్వహణకు – వెంకట రమణ, జిల్లా రవాణా అధికారి శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు – కె. శ్రీరామ్, జిల్లా ఉపాధి అధికారిబీ సాయి కృష్ణ, సబ్జెక్ట్ అసిస్టెంట్, విద్యా శాఖ సామగ్రి నిర్వహణకు – జి. దినేశ్ కుమార్, సహాయ సంచాలకుడు (మైన్స్ జియాలజీ)బీ వై.టి.టి.వి. రమణ రావు, అకౌంట్స్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎంసీసీ, ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు – ఎం. విద్యా చందన (ఎల్.బీ.), జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డిఏ) వ్యయ గణాంకాల సేకరణకు – కె. సంజీవరావు, జిల్లా ప్రణాళిక అధికారి అభ్యర్థుల ఖర్చు లెక్కల పర్యవేక్షణకు – జి. శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డేటా పర్యవేక్షణకు – మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల జనరల్ మేనేజర్ మోడల్ కోడ్ ఉల్లంఘన కేసుల పరిశీలనకు– ఎం. శ్రీనివాస్ చౌదరి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్, స్పెషల్ బ్రాంచ్ చట్టపరమైన కేసుల చర్యలకు – చి. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, స్పెషల్ బ్రాంచ్ ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి – ఎ. శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి ఆబ్జర్వ ర్ల సమన్వయానికి – ఎస్. త్రినాథ్ బాబు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్ బ్యాలెట్ పేపర్ ముద్రణ మరియు పోస్టల్ బ్యాలెట్ పంపిణీకి – వి. బాబు రావు, జిల్లా వ్యవసాయ అధికారి మీడియా కమ్యూనికేషన్ మరియు సమాచార ప్రసారానికి – మొహమ్మద్ అజ్గర్ హుస్సేన్, జిల్లా పౌర సంబంధాల అధికారి హెల్ప్‌లైన్ , ఫిర్యాదుల పరిష్కారానికి – శ్రీరామ్ సుశీల్ కుమార్, జిల్లా ఇన్ఫర్మా టిక్స్ అధికారి రిపోర్టులు, నివేదికల సమర్పణకు– బి. నాగలక్ష్మి, సీఈఓ, జిల్లా పరిషత్ బీ కె. చంద్రశేఖర్,ఉప సీఈఓ, జిల్లా పరిషత్ వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణకు – జె. సైదేశ్వం రావు, ఈ–డీఎం, భద్రాద్రి కొత్తగూ డెంబీ హెచ్. వెంకటేశ్వ రరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారినోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణలో క్రమశిక్షణతో, సమయపా లనతో వ్యవహరిం చాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలను అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు.

## అక్టోబర్ నెలాఖరు వరకు యూరియా పంపిణీ పట్ల అప్రమత్తంగా ఉండాలి:: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**- యూరియా పంపిణీ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**






**చర్చ :- కరీంనగర్ పెద్దపల్లి,** వ్యవసాయ అవసరాల కోసం రైతులకు యూరియా పంపిణీ అంశంలో అక్టోబర్ నెలాఖరు వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూరియా లభ్యత, పంపిణీ పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వ్యవసాయ అవసరాలకు యూరియా పంపిణీ సంబంధించి పిక్ డిమాండ్ సమయం ముగిసిందని, అధికారులు రిలాక్స్ కాకుండా అక్టోబర్ నెలాఖరు వరకు అప్రమత్తంగా ఉంటూ పెండింగ్ డిమాండ్ కు రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.మన జిల్లా నుంచి స్టాకు పక్క జిల్లాలకు అక్రమంగా తరలి పోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరిగే దిశగా వ్యవసా య శాఖ తరపు నుంచి పటిష్ట కార్యాచరణ వ్యవసాయ విస్తరణ అధికారుల వారీగా సిద్ధం చేసి పెట్టుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ సహాయ సంచా లకులు అంజనీ , శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల అభ్యర్థుల ఖర్చు పరిమితులు – గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో అధికారుల సమీక్ష.





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు మరియు రాజకీయ పార్టీలు ఖర్చు చేయగల వ్యయ పరిమితులను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి , డీపిఒ రాంబాబు సోమవారం ఐడిఓసి కార్యాల యం సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల ఖర్చు పరిమితులు మరియు వ్యయ పర్యవేక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో మాట్లాడిన సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల ఖర్చు పరిమితులను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం జెడ్పిటిసి అభ్యర్థులు రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.1.50 లక్షలు వరకు, సర్పంచ్ అభ్యర్థులు గ్రామపంచాయతీ జనాభా ఆధారంగా రూ.2.50 లక్షలు లేదా రూ.1.50 లక్షల వరకు వ్యయం చేయవచ్చని తెలిపారు.2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.50,000ల వ్యయ పరిమితి, 5 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.1.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.30,000ల వ్యయ పరిమితి ఉంటుందని వివరించారు.డీపిఒ రాంబాబు మాట్లాడుతూ, అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ప్రచార ఖర్చులు కూడా ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖాతాలో చేర్చబడతాయని తెలిపారు. ప్రచారంలో వాహనాలు, మైక్ సెట్లు, పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్లు మొదలైన వాటి ఖర్చులు కూడా లెక్కలో చూపించాలని సూచించారు.ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల అనంతరం 45 రోజుల్లోపు తమ తుది ఖర్చు నివేదికలను సంబంధిత నియామక అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ఖర్చు పర్యవేక్షణ కమిటీలు, వీడియో సర్వైలెన్స్ టీములు కఠినంగా పర్యవేక్షణ జరపనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లక్ష్మణ్ అగర్వాల్, భారతీయ రాష్ట్ర సమి తి అనుదీప్, సిపిఐ పార్టీ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ నోముల రమేష్, సిపిఐ ( ఎం) సత్యనారాయణ మరియు సిపిఐ ( ఎం సి ) గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుని బెదిరించడం నాయకుడి లక్షణం కాదు

**- విలేకరి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీపీఐ జిల్లా కార్యదర్శి పై కేసు నమోదు చేయాలి**

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**కొత్తగూడెం, అక్టోబర్ 6(చర్చ):**

కొత్తగూడెం పత్రిక విలేకరిగా పనిచేస్తున్న చదలవాడ సూరి ఆత్మహత్యయత్నంకు కారకులైన సిపిఐ జిల్లా కార్యదర్శిపై వెంటనే కేసు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ చదలవాడ సూరి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు.ప్రజాస్వామ్యంలో పత్రిక జర్నలిస్టుల స్వేచ్ఛను,అనగతొక్కాలని చూస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.సిపిఐ జిల్లా కార్యదర్శిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఒక జర్నలిస్టు ఆత్మహత్యయత్నానికి కారకుడైన సిపిఐ జిల్లా నాయకుడిపై పోలీసులు వెంటనే చట్టపరంగా కేసులు నమోదు చేయాలని కోరారు.ఈవిషయంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల అధ్యక్షులు బలగం శ్రీధర్,మాలోత్ గాంధీ,గొడుగు శ్రీదర్ మాడ కృష్ణారెడ్డి టౌన్ జనరల్ సెక్రెటరీ ఆగుల్ల వీరేశలింగం వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు తప్పదు

## - సిపి సజ్జనార్!



**హైదరాబాద్, అక్టోబర్ 06(చర్చ):** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ సోమవారం హైదరాబాద్ కమిషనర్ రేట్ పరిధిలోని మాదన్నపేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, క్రైమ్ డీటైల్స్‌ను సజ్జనార్ స్వయంగా పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తనిఖీ అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన సీపీ మాట్లాడుతూ పోలీసింగ్ అంటే కేవలం చట్ట అమలు చేయడమే కాదు ప్రజలతో నమ్మకం కలిగించే విధంగా పనిచేయడమే నిజమైన సేవని తెలిపారు. పారదర్శకత, క్రమశిక్షణ, సత్సంబంధాలు పోలీసుల ప్రతిష్ఠను పెంచుతాయని స్పష్టం చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత యూనిఫాం వేసుకున్న సీనియ ర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిష ్నర్‌గా బాధ్యతలు చేపట్టి తమ దైన మార్క్‌ను చూపించడం ప్రారంభించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడేవారికి స్ట్రాంగ్ వార్నింగ్‌లు ఇస్తున్నారు. తాజాగా.. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో మందుబాబు లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత నాలుగేళ్లుగా టీజీఎస్‌ఆర్టీసీ ఎండీగా పనిచేసిన సజ్జనార్.. ఇప్పుడు సీపీగా చార్జ్ తీసుకొని ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపుతామని.. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే జైల్లో ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# అక్కడ స్టే ఇవ్వడానికి నిరాకరిస్తే ఇక్కడికి వస్తారా?

## - సుప్రీంకోర్టు

## - బీసీ రిజర్వేషన్ కు వ్యతిరేకంగా ధాఖలైన పిటిషన్ ను కొట్టేసిన సుప్రీంకోర్టు



**హైదరాబాద్, అక్టోబర్ 06(చర్చ):** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ను సోమవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది, వంగ గోపాల్ రెడ్డి రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే, ఈ నేపథ్యంలోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ జరుగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టులో కేసు విచారణలో ఉండగా ఇక్కడికి ఎందుకు వచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి న్యాయవాది బదులిస్తూ, హైకోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించిం దని తెలిపారు. అక్కడ స్టే ఇవ్వడానికి నిరాకరిస్తే ఇక్కడికి వస్తా రా?" అని వ్యాఖ్యానించిన ధర్మాసనం, హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలే మని చెబుతూ పిటిషన్‌ను తిరస్కరించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని వంగా గోపాల్ రెడ్డి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీల కు 10 శాతం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో మొత్తం కోటా 67 శాతానికి చేరిందని, ఇది చట్టవిరుద్ధ మని పేర్కొన్నారు. జీఓ నంబర్ 9ను తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌లో మాధవరెడ్డి, తీన్మార్ మల్లన్న కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీఓ నంబర్ 9ను జారీ చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఈ జీఓ ఆధారంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11 వరకు ఐదు దశల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక లభ్యత

## - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**చర్చ, ఖమ్మం:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక అవసరమైన స్థాయిలో లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరెట్‌లోని తన చాంబర్‌లో మధిర నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో ఇసుక లభ్యతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరాకు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల నుండి ఇసుక లభ్యత సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని, ప్రతి మండల స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మేర ఇసుక అందుబాటులో పెట్టాలని, అదే సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు అవసరమైన మేర ఇసుకను సంబంధిత మండల ఇంజనీరు సిఫార్సు మేరకు తహసిల్దార్ కూపన్ జారీ చేసి ఇసుక సరఫరా చేయాలని అన్నారు. ఇసుక సరఫరాలో మండల స్థాయిలో ఉన్న సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి పరిష్కరించాలని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో స్థానిక అవసరాల మేరకు అవసరమైన ఇసుకను డంప్ చేయాలని అన్నారు. ఇసుక డంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఇసుక డంప్ నుంచి అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, తహసిల్దార్ లు, ఎంపీడీఓ లు, హౌసింగ్ ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# త్రిపురారంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలు







**చర్చ ప్రతినిధి నల్గొండ జిల్లా**
నల్గొండ జిల్లా, త్రిపురారంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని తనిఖీ చేసి సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి పేర్లు, వివరాలు ,ఇష్టం ఉన్న సబ్జెక్టులు ,తదితర అంశాలను ముచ్చటించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు చెప్పారు. పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు విద్యార్థులు తరగతి గదిలో చదువుకోవడమే కాకుండా అక్కడే నెల పై పడుకుంటున్నారని తెలుసుకుని తక్షణమే 100 పరుపులను నల్గొండ నుండి పంపిస్తానని కలెక్టర్ చెప్పారు. మినీ గురుకులంలో నిర్మాణంలో ఉన్న ఆదనపు తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు .సాధ్యమైనంత త్వరగా అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గురుకులం గ్రౌండ్ లోతుగా ఉందని, మట్టి కావాలని ప్రిన్సిపల్ భారతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. అంతేకాక ఫార్మసీలో స్టాక్ లో ఉన్న మందులు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స, రిజిస్టర్లు, రిపోర్టులు తదితర వివరాలను పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,మినీ గురుకులం ప్రిన్సిపల్ భారతి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, తహసిల్దార్ ప్రమీల ,ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

## - మెరుగైన వనరుల ఏర్పాటుతో భావితరాలకు నాణ్యమైన విద్య

## - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**చర్చ, ఖమ్మం:** పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఐకాన్‌గా నిలవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులపై టిజిఇడబ్ల్యూఐడిసి సిఇ షఫీమియాతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. భవనాల నిర్మాణ పురోగతి పనుల నమూనా మ్యాప్ లను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కూల్ సముదాయానికి చేరుకునే అప్రోచ్ రోడ్ల పనులు, తాగునీటి వసతి, పార్కింగ్, విద్యుదీకరణ, సబ్ స్టేషన్ ఏర్పాటు, టాయిలెట్లు, క్రీడా ప్రాంగణం, పైపులైన్, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు, అంతర్గత రోడ్లు, వసతి గృహాలు, 3000 మంది విద్యార్థులు, స్టాఫ్‌కు సరిపడ వసతుల కల్పనకు నాణ్యతతో యుద్ధప్రతిపాదన పనులు కొనసాగిస్తూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో చదివే విద్యార్థులను తీర్చిదిద్దబడతారని తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూర్చే వరప్రదాయినిగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిలుస్తాయిని అన్నారు. ఈ సమీక్ష లో పీఆర్ ఎస్ఇ జి. వెంకటరెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం పిల్లల ప్రాణాలు కాపాడుతుంది

## - శ్రీ జయవిలాసిని డెవలపర్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ ఎండి కుంచెపు రాంబాబు



**చర్చ, ఖమ్మం :** రక్తదానం ద్వారా ఇచ్చే రక్తం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి ప్రాణాలు కాపాడుతుందని శ్రీ జయవిలాసిని డెవలపర్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుంచెపు రాంబాబు అన్నారు. ఆయన 43వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బైపాస్ రోడ్‌లోని శ్రీ జయవిలాసిని డెవలర్స్ ఆఫీస్‌లో తలసేమియా పిల్లల కోసం సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా ఒక వంశపారంపర్య రక్త రుగ్మత అని, దీనికి కారణం హీమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రభావితం చేసే జన్యు లోపాలు (తప్పు జన్యువులు) అన్నారు. తల్లిదండ్రులకు ఉండే ఈ జన్యువుల ద్వారా పిల్లలకు సంక్రమించి, శరీరం తగినంత హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల ఎర్ర రక్తకణాలు దెబ్బతిని రక్తహీనత వస్తుందన్నారు. తలసేమియా ఉన్నవారికి క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా భాయ్, భాగం శీను, దోబ్బల సురేష్, టీవీ రాజు, జహీర్ భాయ్, చేన్ను కొండయ్య, ఆకుమయ్య, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ



**చర్చ, ఖమ్మం:** టీజీఎస్ ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి ఆదేశాల మేరకు దసరా పండుగ రద్దీ నేపథ్యంలో కమ్మం రీజియన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఖమ్మం రిజినల్ మేనేజర్ సరిరామ్ చేతుల భోజనం ప్యాకెట్లు అందచేశారు. సోమవారం ఖమ్మం బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో దసరా విధుల్లో ఉన్న కండక్టర్, డ్రైవర్లు, సూపర్వైజర్, సెక్యూరిటీ సిబ్బందికి భోజనం ప్యాకెట్లను అందచేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రంలో డిప్యూటీ రిజినల్ మేనేజర్ మల్లయ్య, డిఎం శివప్రసాద్, సెక్యూరిటీ ఎస్ఐ కోటాజీ పాల్గొన్నారు.

# రాణి దుర్గావతి జీవితం మహిళలందరికీ ఆదర్శనీయం



**చర్చ, ఖమ్మం :** మొగల్ సామ్రాజ్యాని ఎదిరించి అక్బర్‌ను రెండుసార్లు ఓడించిన వీర వనిత రాణి దుర్గావతి అని, తన ప్రాణాలను సైతం ఈ దేశం కోసం అర్పించిన ధీశాలి అని, ఆమె జీవితం మహిళలందరికీ ఆదర్శనీయం అని కాయం రామకృష్ణ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ దొడ్డ అరుణ అన్నారు. దుర్గావతి 501వ జయంతి సందర్భంగా కాయం టెస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ చరిత్ర అంటే రాజులు, రాజ్యాలే గుర్తుకు వస్తాయని, భర్త చనిపోతే రాజ్యాన్ని సరైన మార్గంలో పెట్టి ఎన్నో యుద్ధ పోరాటాలు చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా గొప్ప యోధురాలు రాణి దుర్గావతి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ దొడ్డ భవాని, వజ్జ సునీత, కల్తీ భవాని, ఈసం విజయ, పొడుగు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు నివాళులర్పించిన 'నామ'



**చర్చ, ఖమ్మం:** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన మాతృమూర్తి నామ వరలక్ష్మి 5వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామం లోని నామ ముత్తయ్య %-% వరలక్ష్మి స్మృతివనంలో నివాళులర్పించారు. సోమవారం తన సోదరులు నామ సీతయ్య, నామ కృష్ణయ్య, సోదరి కమ్మ ధనమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి స్మృతి వనాన్ని సందర్శించి అమ్మానాన్నల విగ్రహా లకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అంతకుముందు నెహ్రూనగర్‌లోని స్వగృహం వరలక్ష్మి నిలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సాగర్ జలాల్లో పిండప్రదానం చేశారు. తనకు ఎల్లప్పుడూ తల్లిదండ్రుల స్ఫూర్తిగా నిలిచారని, వారు తన జీవితానికి మార్గదర్శకమని నామ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నామతో పాటు నామ తరుణ్, కనకమేడల సత్యనారాయణ, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, వనం నగేష్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్బంగా మొక్కలు నాటిన శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6(చర్చ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా శంభీపూర్ లోని పార్టీ కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పేరిట తెలంగాణ పచ్చని తెలంగాణగా తీర్చి దిద్దుతే ఆయన అడుగుజాడల్లో నడుస్తూ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పేరుతో కోట్లాది మొక్కలు నాటి రేపటి తరాలకు మంచి గ్రీనరి, మంచి ఆక్సీజన్ ఇచ్చేలా చెయ్యడం గొప్ప విషయం అని ఇంతటి గొప్ప కార్యక్రమం లో భాగస్వామ్యం చేసిన సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6(చర్చ):**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా శంభీపూర్ లోని పార్టీ కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పేరిట తెలంగాణ పచ్చని తెలంగాణగా తీర్చి దిద్దుతే ఆయన అడుగుజాడల్లో నడుస్తూ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పేరుతో కోట్లాది మొక్కలు నాటి రేపటి తరాలకు మంచి గ్రీనరి, మంచి ఆక్సీజన్ ఇచ్చేలా చెయ్యడం గొప్ప విషయం అని ఇంతటి గొప్ప కార్యక్రమం లో భాగస్వామ్యం చేసిన సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## నిబంధనలను అనుసరించి విధుల్లో పాల్గొనాలి

**- ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ దిశా నిర్దేశం**



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**రెండవ ఎంపీటీసీ, జెడ్పిటిసి సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బందికి కొత్తగూడెం పట్టణ పరిధిలోని ఆనందఖని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్.వి పాటిల్ పాల్గొని ఎన్నికల నిర్వహణకు ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులు ఎన్నికల కమిషనర్ నియమ నిబంధనలను అనుసరించి మాత్రమే విధులు నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ గారుసాయికృష్ణ , అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్ ) విద్యా చందన, జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.నాగలక్ష్మి, ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి కె. చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనీస్ సాయికృష్ణ, 52 మంది టీఓటీలు, 57 మంది ఎఫ్ఎస్‌లు, 38 మంది ఎస్ఎస్‌టీలు హాజరయ్యారు.

## వైద్యుల నిర్లక్ష్యం కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి



**ఆంధ్రప్రదేశ్ : కాకినాడ జిల్లా,** తుని ప్రభుత్వ ఆసుపత్రిలో రత్నకుమారి అనే మహిళా.. శనివారం ఉదయం ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చి మరణించింది. డెలివరీ తర్వాత ఆమెకు ఎక్కువగా బ్లీడింగ్ అవుతున్నా, వైద్యులు పట్టించుకోలేదని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఆమెను కాకినాడకు తీసుకెళ్తుండగా కోమాలోకి వెళ్ళింది. దీంతో తిరిగి తుని ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అక్కడ డాక్టర్లు చనిపోయిన ఆమెకు చికిత్స చేస్తున్నట్టుగా నటించారని బంధువులు ఆరోపిస్తున్నారు...

## న్యాయ సహాయ క్లినిక్ ప్రారంభం

**- కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ, రాజన్న సిరిసిల్ల.**







**చర్చ:- కరీంనగర్ రాజన్న సిరిసిల్ల**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో న్యాయ సహాయ క్లినిక్‌ను డి-అడిక్షన్/రిహాబిలిటేషన్ సెంటర్, బస్తీ ఆసుపత్రి, రాజీవ్ నగర్, సిరిసిల్లలో సోమవారం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తెలియజేశారు.. ఈ సందర్భంగా రాధిక జైస్వాల్ గారు మాట్లాడుతూ గౌరవ సభ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ, హైదరాబాద్ గారి ఆదేశాలతో, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీమతి.పి.నీరజ గారి మార్గదర్శకత్వంలో, %ణవీడనూ% శ్రీమతి.రజిత గారి సమన్వయంతో మరియు పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ.గీతే మహేష్ బాబాసాహెబ్ గారి అనుమతితో న్యాయ సహాయ క్లినిక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ. చింతోజు భాస్కర్, లోక్ అదాలత్ సభ్యులు, శ్రీ.ప్రవీణ్, మానసిక వైద్య నిపుణులు, శ్రీ. మణివర్మ, మెడికల్ ఆఫీసర్, ఈ. స్వాతి, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## అమృత మంజరి - అంకురం2 'తన ప్రేమగల చేతుల నైపుణ్యం" పుస్తకావిష్కరణ









**చర్చ, ఖమ్మం :** అఖిల ప్రపంచ స్తుతి ధ్యాన నిలయం మనుజ్యోతి ఆశ్రమ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణ శ్రీలహరికృష్ణల సమక్షంలో ఒకే దేవుడు, ఒకే దేశము అనే చైతన్యంతో రూపొందించిన అమృత మంజరి అంకురం 2 'తన ప్రేమగల చేతుల నైపుణ్యం" పుస్తకాన్ని సత్యసాయి సేవా సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ దమ్మల పాటి సుధాకర రావు ఆవిష్కరించారు. సోమవారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమానికి రాయప్రోలు సుబ్రహ్మణ్య శర్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అచలగురు గీతా మందిర్ ఖమ్మం జిల్లా ప్రసిడెంట్ అచలానంద అహ్మద్ అబ్బాస్ , ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, స్టేట్ సెక్రటరీ లతీఫ్ షేక్ , రిటైర్డ్ అసిస్టెంట్ ఇరిగేషన్ ఇంజనీర్ నిత్య నిర్మలానంద డా'శ్రీ సెలువోజు చంద్రమౌళి రాజయోగి , ఖమ్మం ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ, సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనియర్ ఆలస్యం నరసింహారావు, మనుజ్యోతి ఆశ్రమం భక్త బృందం ఏం. శ్రీనివాస్, ఎం నాగేశ్వరావు, జి. రామకృష్ణ , కె.శ్రీనివాస్, కె.అర్జున్ , కె.హర్షిత్ , పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు .

## గ్రీన్ ఫీల్డ్ నాగపూర్- హైదరాబాద్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి

**- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**





**చర్చ :- కరీంనగర్** తెలంగాణ రవాణా మరియు రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ ఆధ్వర్యంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రంలో విజన్ 2047 లో భాగంగా జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్ కింద నాగపూర్ నుండి హైదరాబాద్ వరకు హై స్పీడ్ కారిడార్ అభివృద్ధికై డిపిఆర్ తయారీ కోసం అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర, రామడుగు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఈ కారిడార్ వెళ్తున్నందున డిపిఆర్ తదితర వివరాల గురించి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభగల విద్యార్థులను ఆదుకుంటాం

- విద్యార్థులకు రూ 30.000 లు ఆర్థిక సాయం
- డాక్టర్కాపామురళీకృష్ణ





**చర్చ,వైరా:-** వైరా లయన్స్ క్లబ్,గ్రేట్ విజన్ క్లబ్ ల ఆధ్వర్యంలో జిల్లా విజన్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు గ్రేట్ విజన్ అధ్యక్షులు జాల పుల్లారావు ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ ఆర్థిక సహాయంతో 30 వేల రూపాయలను కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఏన్కూరు కు చెందిన మేడి నాగేశ్వరికి రూ10 వేలు,గ్రూప్ డి లో ఖమ్మంలో రైల్వే కోచింగ్ తీసుకుంటున్న కొట్టే రామకృష్ణకు రూ 10 వేలను, బాసరలో ఐఐటి మూడో సంవత్సరం చదువుతున్న తాటిపల్లి శివ సాయికి రూ10.వేలను వైరా సాయిబాబా మందిరంలో లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు వై బుచ్చి రామారావు జాల పుల్లారావు ఆధ్వర్యంలో ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళి కృష్ణ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుల్లో రాణిస్తున్న విద్యార్థిని విద్యార్థులను ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థులను ఎంతోమందికి సహాయం అందించామని అదే విధంగా జీవితంలో స్థిరపటానికి అనేక మందికి కోచింగ్ నిమిత్తం కూడా సహాయం అందించామని ప్రతిభగల విద్యార్థులను ఎల్లవేళలా ఆదుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు లయన్స్ క్లబ్బు కోశాధికారి గద్దె నీరజ గ్రేట్ విజన్ క్లబ్ సెక్రటరీ గంగవరపు కిషన్ గ్రేట్ విజన్ క్లబ్ కోశాధికారి ఉయ్యూరు రామకృష్ణ జిల్లా కమిటీ సభ్యులు తోటకూర శ్రీకాంత్ కొంకి మల్ల విశ్వేశ్వరరావు మాదినేని సునీత ప్రముఖ వైద్యులు లయన్ డాక్టర్ కోటయ్య కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానాల్లో కొలువులు సేవలుమాత్రంప్రైవేటుదవాఖానాల్లోనా?

**ఖాళీ కుర్చీలు దర్శనం.... వైద్యులు నిర్లక్ష్యానికి నిదర్శనం"**



**చర్చ, సత్తుపల్లి:** కల్లూరు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యం పేద మధ్యతరగతి రోగులకు పెను శాపం గా మారింది.ఒక్క రోజు కూడా సమయానికి రావడం లేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని అన్ని ప్రభుత్వ దవాఖానాల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉందని స్థానిక ప్రజల నుంచి విమర్శలువెల్లువెత్తుతున్నాయి.కొంతమంది డాక్టర్లు ఒక గంట లేదా రెండు గంటల కంటే ఎక్కువ కూడా వారి సేవలు ప్రభుత్వ దవాఖానాలో అందించని దుస్థితి ఏర్పడింది అని సీజనల్ వ్యాధులు సోకిన ప్రజలు వాపోతున్నారు. కల్లూరు మండలంలో ప్రభుత్వ దవాఖాన వైద్యుల దగ్గర నుంచి పశువుల దవాఖాన వైద్యుల దాకా మా ఇష్టం ఎవరైతే మాకేంటి ?మా సొంత క్లినిక్ లలో మేము పనిచేసుకుంటాం.ప్రభుత్వ దవాఖానాకు హాజరు వేయడానికి మాత్రమే వస్తాము అన్న చందంగా ఉంది వైద్యుల నిర్లక్ష్య ధోరణి.ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో, అసలు వస్తాడో రాడో తెలియని దుస్థితి ఏర్పడింది. డాక్టర్లు అందుబాటులో లేక రోగులు సీజనల్ వ్యాధులతో విలవిలలాడుతున్నారు.కల్లూరు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తామని అంటున్నారు ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులు.ప్రభుత్వం ద్వారా లక్షల్లో జీతాలు తీసుకుంటూ సమయానికి విధులకు హాజరై రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారికి అందుబాటులో ఉండకుండా సొంతంగా నడుపుకుంటున్న క్లినిక్ లకు ఎక్కువ సమయం ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ దవాఖానలో బాధ్యతగా తాము నిర్వహించవలసిన విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇటువంటి ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ పేద మధ్యతరగతి రోగులకు చికిత్స చేయకుండా ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న డాక్టర్లపై వైద్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలంటున్నారు ఆసుపత్రి కి వచ్చిన రోగులు.ప్రతిరోజూ ఉదయం 11 గంటలు సమయం దాటినా ఏ డాక్టరూ పిహెచ్సి లో అందుబాటులో లేని వైనం నిత్య కృత్యం అయ్యింది. ఇప్పటికైనా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వ దవాఖానాలకు పట్టిన ఈ వైద్యుల నిర్లక్ష్యాన్ని వదిలించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అలాగే రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మండల బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం.

**- ఈ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు మాజీ ఎమ్మెల్యే సండ్ర!**



**చర్చ, సత్తుపల్లి:**ఎన్నికలు జరగడం ఖాయమని, కొంచెం సమయం పట్టొచ్చని, పక్కాగా ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని నాయకులు , కార్యకర్తలకు సూచించారు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య. పట్టణంలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్ లో సత్తుపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై సన్నహక సమావేశం సోమ వారం జరిగింది. ఈ సమావేశానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హజరై మాట్లాడుతూ ఎస్.సి,ఎస్.టి రిజర్వేషన్ లు మారవన్నారు. 13 ఎంపీటీసీలు, 21 గ్రామ పంచాయతీలు మన మండలంలో ఉన్నాయని ఈ ఎన్నికను తేలికగా తీసుకోవద్దన్నారు. అధికారంలో లేకపోయినా ప్రభుత్వ అసమర్థతను ఉపయోగించి గెలవవచ్చని నాయకులు, కార్యకర్త లలో ధైర్యాన్ని నింపారు. సోషల్ మీడియాలో ఆక్టివ్ గా ఉంటే పోలీస్ స్టేషన్ లకు పిలుస్తున్నారని ఎవ్వరూ అధైర్య పడవద్దని అందరికి అండగా పార్టీ ఉంటుందని,మేమంతా మీ వెనుక ఉన్నామనే భరోసాని కల్పించారు. గతంలో లేని బిన్నమైన సంప్రదాయాన్ని స్టార్ట్ చేసారని అధికార పార్టీ నాయకుల పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు యూరియా కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని,ప్రజలకిచ్చిన హామీలలో అటకెక్కాయన్నారు. మనం అధికారం లో ఉన్నప్పుడు రెగ్యులర్ గా కల్యాణలక్ష్మి అందించ్చామని,వాళ్ళు తులం బంగారం అన్నారని, అదెక్కడికి పోయిందో తెలియదన్నారు. సత్తుపల్లి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందని, దాన్ని ప్రారంభించకుండా పాత భవనంలో వైద్య సేవలు అందించటం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంలో దసరా కి బతకమ్మ చీరలు,క్రిస్మస్ కి గిఫ్ట్ లు ఇచ్చామని, నేడు ఆ ఊసే లేదని ఎద్దేవా చేశారు. పల్లెల్లో పల్లె ప్రకృతి వనాలు లేవని,పారిశుధ్యం పడకేసిందని, విష జ్వరాలు పల్లెల్లో ప్రభలుతున్నా పట్టింపులేదన్నారు. ప్రజలు రైతుల్లో ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను మనం ఓటుగా మలచుకోవాలని సూచించారు. పెన్షన్ లు పెంచుతమన్నారని, వృద్ధులు,వికలాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ పెంచలేదన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నార న్నారు. పోలీస్ స్టేషన్ కి ప్రతిపక్ష నాయకులు రావొద్దని,సీసీలో రికార్డు అవుతుంది అంటున్నా రని పోలీసుల తీరుపై మండిపడ్డారు. స్టేషన్ లో సీసీ టీవీ ఫుటేజ్ కాంగ్రెస్ నాయకుల దగ్గర ఉందా అని ప్రశ్నించారు. ఆంధ్రా నుండి విచ్చలవిడిగా ఇసుక వస్తుందని, దాన్ని పట్టించుకొనే నాధుడే లేదని,ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ప్రజలకు కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు ఇచ్చి వాళ్లను ఎలా మభ్యపెట్టారో వివరించాలని పిలుపునిచ్చారు. వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ లను ఎండగట్టాలన్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేసుకుని ముందుకు పోవాలని,ఈ ఎన్నికల ను ప్రతిష్టాత్మకంగా తీసుకుందామని ప్రతి ఒక్కరిని గెలిపిం చుకునే బాధ్యత మీపై ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సైలను సన్మానించిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిట

**- దసరా ఉత్సవాలు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతగా చిరు సన్మానం**





**చర్చ,వైరా :-**స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం లో జరిగిన దసరా మహొత్సవాల్ని విజయవంతం అయ్యేందుకు వైరా ఎస్సైలు పుష్పాల రామారావు,పవన్ లను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం వైరా పోలీస్ స్టేషన్ లో చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి చీరను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలోమహాలక్ష్మి అమ్మవారి ఆలయ చైర్మన్ వేముల శివ కృష్ణ దేవళ్ల గోవిందరావు తిరుపతి శీను బండారు తిరుపతిరావు ఓర్సు శ్రీనివాసరావు ఓర్సు నారాయణ మరియు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లల 'భగీరథ' కష్టాలు

**- పాఠశాల ముందు తవ్వకాలతో ఇబ్బందులు**

**- కనీసం హెచ్చరిక బోర్డులు లేని వైనం**

**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు**









**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**మెయిన్ సెంటర్లో ఆ పాఠశాల ఉండటమే వారి పట్ల శాపంగా మారుతోంది. ప్రతీ చిన్న పనికి వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పాఠశాలకు రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అటు ప్రభుత్వ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కొత్తగూడెం పట్టణం పోస్టాఫీస్ సెంటర్లో ఉన్న సెయింట్ మేరీస్ పాఠశాల ఎదురుగా సుమారు 150 మీటర్ల పొడవునా రెండు అడుగుల వెడల్పుతో, సుమారు 5 అడుగుల లోతున మిషన్ భగీరథ పైపులైన్ కోసం ప్రొక్లెయిన్‌తో గోతులు తీశారు. నిన్నటివరకు సెలవులు కాగా, సోమవారం నుండి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులంతా పాఠశాలబాట పట్టారు. అయితే స్కూల్‌కు సెలవులు ఇచ్చిన సమయంలో మిన్నకుండా ఉన్న సంబంధిత కాంట్రాక్టర్, పాఠశాలలు తెరిచిన రోజే ఇలా మిషన్ భగీరథ పైపులైన్ల కోసం గోతులు తీయడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఆదివారం పైపులైన్ పనులు జరుగుతుండగా బీహార్‌కు చెందిన సంతోష్ అనే దినసరి కూలి ఆ గొయ్యిలో పడి గాయాలపాలైన విషయం తెలిసిందే. ఒక దశలో మట్టి పెల్లలు అతనిపై పడడంతో శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. వెంటనే అక్కడే ఉన్న తోటి సిబ్బంది అతడిని కాపాడటంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. అయినప్పటికీ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకుండానే సంబంధిత కాంట్రాక్టర్ సోమవారం యధావిధిగా పనులు ప్రారంభించారు. దీంతో సాయంత్రం పాఠశాల విడిచి పెట్టిన సమయంలో విద్యార్థులను తీసుకెవెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆ గోతులను దాటే క్రమంలో అందులో పడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం సమయానికి కొంత వరకు గుంతను పూడ్చినప్పటికీ అప్పటికే పడిన వర్షం కారణంగా ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. అంతేకాక విద్యార్థుల కోసం తల్లిదండ్రులు తమ వాహనాలను రోడ్డుపైనే పెట్టడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య సైతం ఏర్పడింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

**- రేకుర్తిలోని లక్ష్మీ నరసింహ కాలనీ లబ్ధిదారుడి ఇంటికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన సుడా చైర్మన్**






**చర్చ :- కరీంనగర్** అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రేకుర్తి లోని లక్ష్మి నరసింహ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారుడు మహమ్మద్ అబ్దుల్లా ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని రానివారు ఎవ్వరు ఆందోళన చెందవద్దని రెండో విడతలో అవకాశం వస్తుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. భూమి లేని నిరుపేదలకు గాంధీ నగర్ లోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తి చేసి కొంతమందికైనా ఇచ్చి ఆదుకుంటామని నరేందర్ రెడ్డి అన్నారు. నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు మొదలు పెట్టిన మహమ్మద్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆస్తాపురం రమేష్,ఎండి చాంద్,ఊరడి లత,అస్తపురం తిరుమల,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,పర్వతం మల్లేశం,ఆవూరి లత,వారాల నర్సింగం,లక్కెపెల్లి మల్లేశం,మ్యాక శ్రీనివాస్,దుబ్బుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిగురు మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా తో కలిసి తనిఖీ చేశారు.

**చర్చ :- కరీంనగర్**





అటెండెన్స్ రిజిస్టర్,అవుట్ పేషెంట్ రిజిస్టరు లను ఇతర రికార్డులను వెరిఫై చేశారు. ఎన్ సి డి క్లినిక్ లో అసంక్రమిత వ్యాధుల రికార్డులను పరిశీలించి అందులో అధిక రక్తపోటు మరియు షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. అవుట్ పేషెంట్ల తో మాట్లాడుతూ వారు అధిక రక్తపోటు మరియు షుగర్ వ్యాధికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను వాడుతున్నారా అని అడిగి తెలుసుకుని అందరూ వాడుకోవాలని మందుల ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. మరియు వార్డులో చికిత్స పొందుతున్న ఇన్ పేషంట్లతో మాట్లాడుతూ వారికి అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు. ఫార్మసీ స్టోర్స్ లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందుల పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగేటట్లుగా గర్భవతులను మరియు వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. పీహెచ్సీ డెలివరీ లను ఇంప్రూవ్ చేయాలన్నారు. తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు హెల్త్ వెల్నెస్ సెంటర్ ముల్కనూర్, అల్గునూర్ మరియు పట్టణ ఆరోగ్య కేంద్రం కట్టరాంపూర్ సందర్శించి ఫార్మసీ స్టోర్ లో మందుల నిలువ వివరాలను పరిశీలించి, పలు రికార్డులను వెరిఫై చేసి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, చిగురు మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ మరియు ముల్కనూర్ ఎం ఎల్ హెచ్ పి మంజుల, సంబంధిత వైద్య సిబ్బంది ఉన్నారు.

## ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి పై కేంద్ర ప్రభారి అధికారిసోలామన్ అరోకియా రాజ్ ఐఏఎస్ సమీక్షా





**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:** ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించడానికి, కేంద్రప్రభారి అధికారి సోలామన్ అరోకియా రాజ్ , అదనపు కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల శాఖ, సోమవారం జిల్లా పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన జిల్లా ప్రధాన కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ, మహిళా , ఇతర అభివృద్ధి సంబంధిత కేంద్రాలను పరిశీలించిన తర్వాత, ఐడిఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. విద్యా రంగంలో ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు పర్యవేక్షణతో అందించడం, పాఠశాలల్లో ఔషధ మొక్కల పెంపకం, విద్యా ప్రమాణాలను పెంపొందించే చర్యలు చేపట్టడం వంటి విషయాలను కలెక్టర్ వివరించారు. ఆరోగ్య రంగంలో తల్లి–పిల్లల ఆరోగ్యం, నూతన బ్లడ్ బ్యాంకుల స్థాపన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మేళవించిన వైద్య సేవల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో మునగా, వెదురు అజోల్ల, పుట్టగొడుగుల సాగు, చేపల పెంపకం యూనిట్లు, బయోచార్ తయారీ ఫామ్ పౌండ్ల నిర్మాణం వంటి పథకాల అమలు, అశ్వరావుపేటలో జీవ వనరుల కేంద్రం ఏర్పాటు మరియు మహిళా సంఘాల అభివృద్ధికి కల్పిస్తున్న సదుపాయాలపై స్పష్టంగా వివరించారు. సమావేశంలో కేంద్రప్రభారి అధికారి సోలామన్ ఆరోకియా రాజ్ ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ నిరంతరం పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయవలసిన అవసరం ఉన్నదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒక ఆకాంక్షిత జిల్లా కాబట్టి, ప్రతి అభివృద్ధి సూచికపై సమగ్ర దృష్టి పెట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విధంగా కార్యాచరణ కొనసాగించాల్సినదని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపై ఏకాభిప్రాయం అయినా కోర్టుకు వెళ్లారన్న మంత్రి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చటాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు.రాష్ట హైకోర్టులో వాదనలు జరిగాయని. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు. హైకోర్టులో ఈకేసుపై 8వ తేదీ విచారణ జరగాల్సి ఉందని. ఈ లోపే వారు సుప్రీంకోర్టుకు వచ్చారన్నారు. న్యాయ బద్ధంగా సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.కాగా.. 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంలో



విచారణ జరుగుతుంది. సుప్రీంలో వాదనలకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణ తరపున సింఘ్వి , దవే వాదనలు వినిపించనున్నారు. ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు బట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని పిటిషన్ వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని పిటిషిన్ దాఖలైంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ముందు కేసు విచారణ రానుంది.

# కాంగ్రెస్‌ను ఓడించేందుకు యూరియా సమస్యలు చాలు

**నర్సింహులపేట అక్టోబర్ 6 :** రైతుల కష్టకాలంలో ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యూరియా ఒక్కటే కాంగ్రెస్‌ను ఓడిస్తుందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా నర్సిం హులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమా వేశం మండల అధ్యక్షుడు మైదం దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లా డుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డికి ఎన్నికలు జరిపే ఉద్దేశం లేదని ఆరోపించారు.శాసనసభ ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి బీసీ అభివృ ద్ధి కోసం బడ్జెట్లో 20 కోట్లు కేటాయిస్తామని ఎన్నికల తీర్మానం చేసి ఆ ఊసే మరిచారని దుయ్యాబ ట్టారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు జిఓ ద్వారా ఇచ్చి ఎన్నికలకు వెళితే రాష్ట్రపతి, కేంద్రానికి తీర్మానం ఎందుకు పంపారని, ఇది తెలివి తక్కువ తనానికి నిదర్శనమని అన్నారు. నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో ఎంపీపీ జడ్పీటీసీలను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంటుందని తెలిపారు. యూరియా కోసం పొద్దుగూకల నుండి తెల్లవా రుజాము వరకు భార్యాభర్తలు జాగారం చేయా ల్సిన పరిస్థితి దాపురించాయని, మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఓటు అడికేందుకు గ్రామాల్లోకి వెళితే మహిళలు చీపురు కట్టతొ కొట్టే రోజులు వచ్చా యని అన్నా రు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు జాటో దేవేందర్, మధుసూదన్ రెడ్డి, సుచీర్ రెడ్డి, రవి నరసింహారెడ్డి, ఖాజామియా, వెంకన్న, కిషన్ నాయక్, శీను, రామన్న, నర్సయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.



# కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య కార్డుల వార్

**హనుమకొండ, అక్టోబర్ 6:** కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య కార్డుల వార్ నడుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు కౌంటర్‌గా కాంగ్రెస్ 'ధోఖా కార్డు' విడుదల చేసింది. హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో బీఆర్ఎస్ కా ధోఖా కార్డును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ, నేతలు (సోమవారం) విడుదల చేశారు. బీఆర్ఎస్ గతంలో హామీలు ఇచ్చి అమలు చేయని పనులతో ధోఖా కార్డును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ కడియం కావ్య, నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ... కేటీఆర్‌కు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అవినీతి పై ఎక్కడైనా చర్చకు సిద్ధమని.. కేటీఆర్ సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు.'మీ ఇంటి బిడ్డ కవిత వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. మాకు ఓటేసి గెలిపించిన ప్రజలకు మేము జీవిత కాలం బాకీ ఉన్నాం. బీఆర్ఎస్ హయాంలో అంతా అవినీతే జరిగి ంది. అభివృద్ధి ముసుగులో అవినీతికి పాల్పడ్డారు. బీఆర్ఎస్ నేతలను చూసి స్టువార్టుపురం దొంగలు సిగ్గుపడుతున్నారు.




బీఆర్ఎస్ పాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ధోఖా బాజ్ కార్డు విడుదల చేస్తున్నాం. కాంగ్రెస్ క్యాడర్ అంతా ఈకార్డును డౌన్ లోడ్ చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రూప్–1 అభ్యర్థులు 3 కోట్ల రూపాయలు ఇచ్చారని తప్పుడు ప్రచారం చేసిన దద్దమ్మలు బీఆర్ఎస్ నేతలు. మేం చెప్పిన మాటల్లో వాస్తవం లేకుంటే మాకు శిక్ష వేయండి' అంటూ నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని నాగరాజు మాట్లాడుతూ.. 'మమ్మల్ని చార్ సౌ బీస్ అంటుండు... వాళ్ల ఇంటిలోనే డెకాయిట్లు ఉన్నారు. లిక్కర్ స్కామర్స్ ఉన్నారు. టిల్లుగాడు ఆస్ట్రేలియాలో వందల ఎకరాలు కొన్నాడని సమాచారం. అందుకే మేము బీఆర్ఎస్‌కా ధోఖా బాజ్ కార్డు విడుదల చేసినం. దీన్ని కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలి' నాయిని నాగరాజు అంటూ పిలుపునిచ్చారు..

# బీజేపీ ఎంపీలకు హరీష్ సవాల్

**హైదరాబాద్, అక్టోబర్ 6:** తెలంగాణ బీజేపీ ఎంపీలకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని విమర్శించారు. బీజేపీది సబ్ కా సాత్ సబ్ కా వికాస్ కాదు పూరా బక్వాస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. వడ్లకో నీతి.. గోధుమలకో నీతా అని తెలంగాణ బీజేపీ ఎంపీలకు అడిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చని.. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుందన్నారు. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుందని మాజీ మంత్రి ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తోందని వ్యాఖ్యలు చేశారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్‌లో రాసుకుంటామని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతామని హెచ్చరించారు. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు కటింగ్ మాస్టర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జేబులో కత్తెర పెట్టుకొని కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్ చేయడం ఇదే రేవంత్ పని అని అన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం రేవంత్ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నారని నిలదీశారు. కేసీఆర్ చెమట ఓడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పుకొచ్చారు.మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్



నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా అంటూ మండిపడ్డారు. తలకిందులుగా తపస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ప్రజలు నమ్మరన్నారు. సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చారు కేసీఆర్ అని తెలిపారు. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలని జనాలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్‌లకు విలువ లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని.. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారని ఆరోపించారు. రెండు నెలల పించన్ ఎగ్గొట్టారన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతీ గ్రామంలో పంచాలని నేతలు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయాలన్నారు. కల్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్ ఎన్నికల ముందు రజినీకాంత్.. తర్వాత గజినికాంత్‌లా అయ్యారంటూ సెటైర్ విసిరారు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసీ సుందరీకరణ కోసం నిధులు ఉంటాయని.. ప్రజలకు ఇచ్చే పథకాల కోసం మాత్రం నిధులు ఉండవని ఆయన అన్నారు.కేసీఆర్ 33 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే రేవంత్ 19 వేల కోట్ల రూపాయలే రుణమాఫీ చేశారన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని దద్దమ్మ, చేతగాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# కూతురి పెళ్లి కోసం భూమి అమ్మాలనుకున్నా ఎవరూ కొంటలేరు

**హైదరాబాద్:** ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కరోనా కంటే కూడా ఘోరంగా ఉంది. దీని కారణంగా రాష్ట్రం దివాలా తీసింది రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలిపోయింది. హైదరాబాద్ నగరంలో ఒక్క ప్లాట్ కూడా అమ్మకాలు జరగడం లేదు. కూతురి పెళ్లి కోసం రైతు భూమి అమ్మాలనుకున్నా కూడా.. దాన్ని కొనేవారే లేరు.." అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పాలనా విధానాలు, ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై బీఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రి మల్లారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలు గత ప్రభుత్వ పాలనను, ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ.. రాబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులకు రాజకీయ దిశానిర్దేశం చేశారు.రేవంత్ రెడ్డి పాలనపై మల్లారెడ్డి విమర్శలు .ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలన తీరు కరోనా మహమ్మారి సమయంలో ఉన్న పరిస్థితుల కంటే అధ్వాన్నంగా తయారైందని ఘాటుగా విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమం కారణంగా రైతులు, యువత గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. అయితే.. గత 22 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న మాదిరిగా మారిందని, ఎక్కడికక్కడ



ఘోరాలు కనిపిస్తున్నాయని విమర్శించారు.రియల్ ఎస్టేట్ రంగం పతనం.మల్లారెడ్డి ప్రధానంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంపై దృష్టి సారించారు. నగరంలో ఒక్క ప్లాట్ కూడా అమ్మకం కావడం లేదు, అపార్ట్‌మెంట్‌లో ఒక గజం కూడా కదలడం లేదన్నారు. రైతు కుమార్తె వివాహం కోసం భూమి విక్రయించాలనుకున్నా.. కొనుగోలుదారులు లేరు.. అంటూ ఆయన రియల్ ఎస్టేట్ ఎంత ఘోరంగా పడిపోయిందో వివరించారు. కరోనా కష్టకాలంలో కూడా వ్యాపారాలు నడిచాయని.. డబ్బు చలామణి జరిగిందని.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో అసలు డబ్బు ఎక్కడా కనిపించ డం లేదని... ఇది ఏదో మాయమైనట్టు లేదా మంత్రం చేసినట్టుగా ఉందని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు.గతంలో హైదరాబాద్‌ను సింగపూర్, న్యూయార్క్ లాగా ప్రపంచమంతా చూసేదని.. ఎత్తైన భవనాలు అమ్ముడయ్యేవని, ఫైనాన్షియల్ సిటీగా రింగ్ రోడ్డు వెంబడి అభివృద్ధి చెందిందని మల్లారెడ్డి గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అదే బిల్డర్లు కష్టాల్లోకి వెళ్లిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మోసాలను గమనించాలని మల్లారెడ్డి రాజకీయ పిలుపు ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయ కుండా.. ఓటుతోటే వారికి బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు దిశాని ర్దేశం చేశారు.కాంగ్రెస్ మోసాలు ప్రజలకు పూర్తిగా అర్థమయ్యా యని, ఇంటింటికి వెళ్లి ప్రజలు కాంగ్రెస్ నాయకులను సూచించారు.'జై తెలంగాణ, జై కేసీఆర్' అంటూ మల్లారెడ్డి తమ ప్రసంగాన్ని ముగించారు.

# ఆయుధ విరమణపై మల్లోజుల కీలక ప్రకటన





**హైదరాబాద్, అక్టోబర్ 6:** సాయుధ పోరాట విరమణపై మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ మేరకు పార్టీ క్యాడర్‌కు లేఖ రాశారు. ఇందులో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌కు కౌంటర్ ఇచ్చారు మల్లోజుల. పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు వీడాలని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బతికున్నప్పుడే తీసుకున్న నిర్ణయం అంటూ లేఖలో వెల్లడించారు. పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఉద్యమం ఓటమి పాలు కాకుండా కాపాడలేకపోయామంటూ క్షమాపణలు చెప్పారు.పార్టీ క్యాడర్‌ను కాపాడుకొని అనవసర త్యాగాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని మల్లోజుల పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు కొనసాగించిన పంథా పూర్తిగా తప్పిదమే అని అంగీకరించారు. తప్పుల నుంచి గుణ పాఠాలు నేర్చుకోవడం అంటే టీకా లాంటిదని సూచించారు. వర్తమాన ఫాసిస్టు పరిస్థితులలో మావోల లక్ష్యాన్ని నెరవేర్చలేమన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని క్యాడర్‌కు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో పట్టుబడి ఎలి లిల్లీ సంస్థకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, అక్టోబర్ 6:** ఐసీసీసీలో సీఎం రేవంత్ రెడ్డితో ఎలి లిల్లీ సంస్థ ప్రతినిధులు (సోమవారం) భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో 9 వేల కోట్లతో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, క్వాలిటీ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఎలి లిల్లీ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో ఎలి లిల్లీ సంస్థను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ. తెలంగాణపైన నమ్మకం వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ అని.. పరిశ్రమలు పెట్టే వారికి తెలంగాన ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తోందని అన్నారు. 1965లో ఇందిరా గాంధీ హైదరాబాద్‌కు ఐడీపీఎల్ తీసుకురావడంతో ఫార్మా హబ్‌గా మారిందన్నారు. హైదరాబాద్‌లో అనేక దిగ్గజ ఫార్మా కంపెనీలు ఉన్నాయన్నారు.40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయని.. కోవిడ్ వ్యాక్సిన్‌లు హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అయ్యాయని తెలిపారు. ఫార్మా పాలసిని తమ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. జినోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జినోమ్ వ్యాలీకి కావాల్సిన టెక్నికల్ సపోర్ట్ అందిస్తామన్నారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫార్మ్‌కు సంబంధించిన అనేక మంది ప్రముఖులు స్కిల్ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎలి లిల్ లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి హాజరయ్యారు.




# ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్ విద్యార్థికి సాయం

**హనుమకొండ, అక్టోబర్ 6:** పేద విద్యార్థిని ఆదుకున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. వరంగల్ జిల్లా పెద్దమ్మగడ్డకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి గణేష్ ట్వీట్‌కు మాజీ మంత్రి స్పందించారు. గణేష్ చదువుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేస్తూ.. తక్షణ సాయం కింద లక్షా యాభై వేల రూపాలయను విద్యార్థికి పంపించారు కేటీఆర్. ఆ పేద విద్యార్థి కలను నెరవేర్చేందుకు మాజీ మంత్రి తన వంతు సహాయం అందజేశారు.పెద్దమ్మగడ్డ గ్రామానికి చెందిన విద్యార్థి గణేష్ సరస్వతీ పుత్రుడు. చిన్నప్పుడే తల్లిదండ్రులను, తోబుట్టువును కోల్పోయిన గణేష్ అమ్మమ్మ ఇంట్లో పెరిగాడు. చిన్నప్పటి నుంచి గణేష్ చదువులో మంచిగా రాణించేవాడు. గణేష్ మొత్తం విద్యాభ్యాసం కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదవాడు. ఆ క్రమంలో ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ ఫ్రీ సీట్ సంపాదించాడు. అయితే ఈరోజు (ఈ నెల 6) వరకు (ట్యూషన్ ఫీజు–డిపాజిట్ )1,50,000 రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఈ అమౌంట్ చెల్లించకపోతే సీటు కోల్పోయే అవకాశం ఉంది. దీంతో పేదవాడు అయిన గణేష్ అంతమొత్తం చెల్లించలేని పరిస్థితి. గణేష్ గురించి తెలుసుకున్న కొందరు... అతడి పరిస్థితిని వివరిస్తూ కేటీఆర్‌కు ట్వీట్ చేశారు.దీనిపై మాజీ మంత్రి వెంటనే స్పందిస్తూ విద్యార్థిని ఆదుకుని.. అతడి చదువు కొనసాగేలా చేశారు. తక్షణ సహాయం కింద లక్షన్నర రూపాయలను పంపించారు. అంతేకాకుండా గణేష్ చదువు బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ చూసుకుంటుందని హామీ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్.. స్వయంగా వెళ్లి గణేష్‌కు డబ్బును అందజేశారు. గణేష్‌ను ఇవాళే కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో జాయిన్ చేసి, బాధ్యతలు తీసుకుంటామని ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ వెల్లడించారు. స్వయంగా కేటీఆర్.. తన సమస్యకు స్పందించి వెంటనే సాయం చేయడం పట్ల విద్యార్థి గణేష్ హర్షం వ్యక్తం చేశాడు. కష్టపడి చదవి డాక్టర్ అవుతానని గణేష్ స్పష్టం చేశాడు.



# ఎల్బీనగర్‌లో భారీగా ట్రాఫిక్ జామ్
## మెట్రో స్టేషన్ వద్ద కిక్కిరిసన జనం

**హైదరాబాద్:** దసరా పండుగ సెలవులు ముగియడంతో ప్రజలు హైదరాబాద్ తిరిగి చేరుకుంటున్నారు. దీంతో ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎంతకూ వాహనాలు కదలక పోవడంతో జనం మెట్రో రైలును ఆశ్రయించారు. దీంతో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ఈ నేపథ్యంలో మెట్రో సిబ్బంది ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చినవారితోపాటు ఆఫీసులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు పెద్ద సంఖ్యలో ఉండటంతో కిలోమీటర్ మేర క్యూలైన్‌లో నిల్చున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ నుంచి ఫ్లాట్‌ఫారం వద్దకు చేరేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతున్నది.మరోవైపు చౌటుప్పల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు వాహనాలు నిలిచిపోయాయి. దసరా చెలవులు ముగియడంతో జనం హైదరాబాద్ బాట పట్టారు. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెకలొకన్నది. ట్రాఫిక్ సమస్య నెలకొనకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

# టమోటా రైతులను ఆదుకుంటాం ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి



టమోటా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాప్తాడు మార్కెట్ లో ఆదివారం టమోటా ధరలు గరిష్టంగా రూ.18, కనిష్ఠంగా రూ.9, మోడల్ ధర రూ.12 గా ఉన్నాయి. టమోటా రేటు భారీగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారిని ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు వర్షాల కారణంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు టమోటా ఎగుమతి తగ్గిందని, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించాయని అచ్చెన్న పేర్కొన్నారు. పత్తికొండ మార్కెట్‌కు 30 నుంచి 40 మెట్రిక్ టన్నులకు మించి టమోటా రాదని, దసరా సెలవులు కావడంతో మరొక 10 టన్నులు అదనంగా వచ్చిందని అన్నారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామన్నారపత్తికొండ మార్కెట్‌లో టమోటాలు సేకరించి చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కి 10 మెట్రిక్ టన్నులు, రైతు బజార్లకు 15 మెట్రిక్ టన్నులు పంపిస్తామన్నారు . టమోటాలకు ట్రెండింగ్ ధరను బట్టి ప్రస్తుతం మంచి ధర లభిస్తోందన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అన్ని విధాలుగా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# జగన్ హయాంలో కల్తీ మద్యంతో ప్రాణాలు తీశారు

**విశాఖపట్నం, అక్టోబర్6 :** జగన్ హయాంలో కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలను తీశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీహయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లేదని ధ్వజమెత్తారు. గత జగన్ ప్రభుత్వంలో ఇద్దరు గిరిజనులు డిప్యూటీ సీఎంలు అయ్యారని. కానీ కనీసం ఒక్కసారైనా ఆశ్రమ పాఠశాలలను సందర్శించారా..? అని ప్రశ్నించారు. కానీ ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు హోంమంత్రి అనిత. (సోమవారం) కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మన్యం జిల్లా గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులను అనిత పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు



హోంమంత్రి. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వైద్యుల నిపుణులతో ఒక కమిటీ వేశామని.. సమగ్రమైన విచారణ జరుగుతోందని చెప్పుకొచ్చారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంత్రి సంధ్యారాణి (ఆదివారం) పరామర్శించారని తెలిపారు హోంమంత్రి అనిత.కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వ్యాఖ్యానించారు. గిరిజ న విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేకమైన దృష్టి పెటా ్టరని చెప్పుకొచ్చారు. ఎప్పటికప్పుడూ అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పరిశీలిస్తున్నారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# గిరిజన బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలి

**విజయవాడ, అక్టోబర్6 :** గిరిజన బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ?గిరిజన బిడ్డలు ఏం తింటున్నారో చూసే పర్యవేక్షణ ఈ ప్రభుత్వానికి అసలే లేదని విమర్శించారు. సంక్షేమ బడుల్లో తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు కూడా లభించడం లేదని చెప్పుకొచ్చారు. గిరిజన బిడ్డల కడుపునకు బుక్కెడు అన్నం పెట్టడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి గిరిజన బిడ్డల సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు వైఎస్ షర్మిల.కురుపాం గిరిజన గురుకులంలో కలుషిత నీరు తాగి ఇద్దరు విద్యార్థినులు మరణించిన ఘటనపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. పాలన వైఫల్యంతో ముక్కు పచ్చలారని బిడ్డలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ?128 మంది గిరిజన బిడ్డలు ఆస్పత్రుల పాలయ్యారంటే ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమేనని విమర్శించారు.



చనిపోయిన బిడ్డల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు వైఎస్ షర్మిల. అత్యవసర వార్డుల్లో చికిత్స పొందుతున్న బిడ్డలకు మెరుగైన వైద్యం అందేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ?ఈ ఘటన మరోచోట పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరుపాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని రోగాలపై నెట్టి తప్పుకుందామని చూస్తే ఊరుకునేది లేదని చెప్పుకొచ్చారు. గిరిజన బిడ్డలపై కూటమి ప్రభుత్వానికి అంత చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. అవి వసతి గృహాలు కాదని.. సమస్యలకు లోగిళ్లని విమర్శించారు. ?గురుకులాల పేరు చెబితేనే బిడ్డలు వణుకుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని షర్మిల విమర్శించారు.

# యాంటీ సబ్‌మెరైన్ యుద్ధనౌక ఆండ్రోత్ జలప్రవేశం



**విశాఖపట్టణం:** భారతీయ నౌకాదళంలోకి కొత్త యుద్ధ నౌక చేరింది. యాంటీ సబ్‌మెరైన్ యుద్ధ నౌక ఆండ్రోత్‌జలప్రవేశం చేసింది. విశాఖపట్టణం నావల్ డాక్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో ఆ యుద్ధ నౌకను కమిషన్ చేశారు. ఆండ్రోత్ యుద్ధ నౌక ద్వారా యాంటీ సబ్‌మెరైన్ యుద్ధ సామర్థ్యం పెరగనున్నట్లు నేవీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్, ఈస్ట్రన్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, ఇతర సీనియర్ నేవీ ఆఫీసర్లు ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ నౌకను డెవలప్ చేశారు. కోల్‌కతాకు చెందిన కంపెనీ ఈ వెసల్‌ను స్వదేశీయంగా తయారు చేసింది. నౌకలోని 80 శాతం పరికరాలు దేశీయంగా తయారైనట్లు ప్రకటనలో చెప్పారు.ఆండ్రోత్ యాంటీ సబ్‌మెరైన్ వెసల్‌లో అడ్వాన్స్‌డ్ వెపన్స్, సెన్సార్లు ఉన్నాయి. ఆధునిక కమ్యూనికేషన్ సిస్టమ్స్‌తో దీన్ని నిర్మించారు. కనిపించని శత్రువులను గుర్తించి, ట్రాక్ చేసి, ఆ తర్వాత ఆ టార్గెట్‌ను నిర్వీర్యం చేస్తుంది. సముద్ర జలాల్లో నిఘా కోసం, గాలింపు, రెస్క్యూ కోసం కూడా ఈ యుద్ధ నౌకను వాడనున్నారు.కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్(జీఆర్ఎస్ఈ) కంపెనీ దీన్ని నిర్మించింది. ఆండ్రోత్‌తో నేవీకి చెందిన ఏఎస్‌డబ్ల్యూ సామర్థ్యం పెరగనున్నట్లు నేవీ పేర్కొన్నది. ఆర్నాలా, నిస్తార్, ఉదయగిరి, నీలగిరి యుద్ధ నౌకలను నేవీ కమిషన్ చేసిన విషయం తెలిసిందే.

# గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకం

**చింతామణి,అక్టోబర్6:** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడమట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌వ్యాఖ్యానించారు. డబ్బు కోసం కాకుండా సగటు ప్రజలకు న్యాయం చేసేందుకు గోపాలగౌడ వచ్చారని ఉద్ఘాటించారు. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని ప్రశంసించారు. ఎన్నో కీలక కేసుల్లో గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకమని ఉద్ఘాటించారు. (సోమవారం) కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో పవన్ కల్యాణ్ పర్యటించారు.గోపాల గౌడ నిదర్శనం.గోపాల గౌడ 75వ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు పవన్. గోపాలగౌడ రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరిం చారు. పవన్‌ని చూడటానికి భారీగా తరలివచ్చారు అభిమానులు, ప్రజలు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ప్రసిద్ధ కవి కుప్పలి వెంకటప్పను గుర్తు చేసుకున్నారు పవన్ కల్యాణ్. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పదవిలో ఉన్నప్పుడు ఎలా ఉండాలి, పదవి తర్వాత ఎవరి కోసం జీవించాలో గోపాలగౌడ ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడే వారి పక్షాన గోపాలగౌడ నిలిచారని ప్రశం సించారు. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలు చేసినా ఎదురు నిలిచారని చెప్పుకొచ్చారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో గౌపాలగౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు పవన్



కల్యాణ్.గోపాలగౌడ.. నాకు వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడే విషయంలో గోపాలగౌడ యువ న్యాయవాదాలకు దిశానిర్దేశం చేశారు. రైతులు, పర్యావరణం అనే అంశాలు నన్ను గోపాలగౌడకు దగ్గర చేసింది. మన బిడ్డల భవిష్యత్తు కోసం రాజకీయాలు చేయాలని నమ్మారు. నేను గతంలో ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. కులం, సామాజిక కట్టుబాట్లను దాటి దేశ ప్రయోజనాల కోసం ముందుకెళ్లాలని గోపాలగౌడ చెప్పారు. పెన్నా పరివాహక ప్రాంతం విస్తారంగా చెరువులు ఉన్నా... ఇప్పుడు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. కోలార్, చిక్ బల్లాపూర్ ప్రాంతాల్లో ఇప్పుడు నీటిసమస్య ఉంది. ఈ సమస్యని పరిష్కరించడానికి ఏపీ నుంచి సహకారం అందిస్తాం. న్యాయరంగంలో గోపాలగౌడ గొప్ప వ్యక్తి. ఆయన పుట్టినరోజు వేడుకలకు రావటం సంతోషాన్ని ఇచ్చింది. కర్ణాటకలో చాలా తెలుగు కుటుంబాలు నివశిస్తున్నాయి. సంస్కృతి -సంప్రదాయాల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య సంబంధం ఉంది. ఏనుగుల గుంపులని కట్టడి చేసేందుకు కుంకీ ఏనుగులని కర్ణాటక ఇచ్చింది. ఏపీలో పంటపొలాలు నాశనం కాకుండా కర్ణాటక ప్రభుత్వం సహకరించింది. శ్రీశైలం దేవస్థానానికి వచ్చే కర్ణాటక భక్తులకు సౌకర్యాల విషయంలో సానుకూలంగా ఉన్నాం' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.రైతులు కోసం పవన్ కల్యాణ్ నిరంతరం ఆలోచిస్తారు: జస్టిస్ గోపాల గౌడతన జన్మదిన వేడుకలకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రావటం చాలా సంతోషంగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడ వ్యాఖ్యానించారు. రైతులు, యువత, మహిళల అభ్యున్నతి గురించి పవన్ కల్యాణ్ నిరంతరం ఆలోచిస్తారని ప్రశంసించారు. సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలో కూడా పవన్ కథానాయకుడేనని కొనియాడారు. కర్ణాటకలోని మూడు జిల్లాల్లో నీటి సమస్య ఉందని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి పవన్ కల్యాణ్ నీటి సమస్యని పరిష్కరించాలని కోరుతున్నానని గోపాలగౌడ పేర్కొన్నారు.


# తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపుల కలకలం



**తిరుపతి:** నగరంలో మరోసారి బాంబు బెదిరింపు కలకలం రేపాయి. తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ వర్సిటీకి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. వర్సిటీ దగ్గర సీఎం చంద్రబాబు పర్యటన కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ దగ్గర ఐఈడీ బాంబులు పెట్టినట్టు ఈ-మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు హెలిప్యాడ్ పరిసరాల్లో బాంబు స్క్వాడ్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మెయిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.అయితే గతంలో కూడా తిరుపతికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. నాలుగు చోట్ల ఆర్డీఎక్స్ పేలుడు పదార్థాలు పేలనున్నాయి.. అంటూ టీటీడీ డోనార్ సెల్‌కు మెయిల్స్ వచ్చాయి. మెయిల్‌తో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లతో తిరుపతితో పాటు తిరుమలను అధికారులు జల్లెడ పట్టారు. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు దొరకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, అప్పుడు కూడా.. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఈ బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. అసలు బెదిరింపులకు ఎవరు పాల్పడుతున్నారు..? ఎందుకు పాల్పడుతున్నారు..? ఈ బెదిరింపుల వెనక రాజకీయ లేదా వ్యక్తిగత కుట్రలు ఉన్నాయా.. ? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. తాజా బెదిరింపుల నేపథ్యంలో తిరుపతిలో భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు.

# పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక వరం అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం నాడు మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ అధికారులు భేటీ కానున్నారు. పోలవరం ప్రాజెక్టుపై సమీక్ష జరుగనుంది. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన నిమ్మల.. పోలవరం ఏపీకి వరం అని.. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పోలవరం 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 72 శాతం పూర్తయ్యిందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు వెనక్కి నెట్టబడిందని పేర్కొన్నారు. జగన్ పాలనలో పోలవరం విధ్వంసం అయ్యిందన్నారు మంత్రి నిమ్మల. డయాఫ్రమ్ వాల్ ధ్వంసం అయ్యిందన్నారు. గత పాలనలో పోలవరం ప్రశ్నార్థకమైపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం





సాధ్యం కాదు అనే విధంగా జగన్ వ్యవహరించారని మంత్రి నిమ్మల దుయ్యబట్టారు. సాక్షాత్తు జగన్ అసెంబ్లీలో పోలవరం గురించి చేసిన వ్యాఖ్యలు చూశామన్నారు. 2023లో ప్రజల ఆశీర్వాదంతో వచ్చిన కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో పోలవరం ప్రాజెక్టుని పట్టాలెక్కించి ఒక టార్గెట్ పెట్టుకొని పని చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును ఫిజికల్‌గా మూడు సార్లు సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలి ంచారని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు గతంలో రూ. 850 కోట్లు ఇచ్చామని మంత్రి వివరించారు. మళ్లీ అధికారం లోకి వచ్చిన తరువాతరూ. 900 కోట్లు ఇచ్చామని తెలిపారు.

# ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కలకలం





**నెల్లూరు జిల్లా :**ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టై ఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది.. కాకపోతే ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారు.ఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది. డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు. తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వరపురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు. ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటున్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.

# ఏపీ సర్కారు కసరత్తు నన్నూరులో బహిరంగ సభ, శ్రీశైలంలో రోడ్‌షోపై ఫోకస్

**కర్నూలు:** కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికా రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల ఎస్పీ సునీల్ షేరాన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు సమావేశంలో పాల్గొన్నారు.రోడ్‌షో, సభలపై ఫోకస్‌ప్రధానమంత్రి పర్యటనసందర్భంగా కర్నూలు నగర పరిధిలో రోడ్డు షో, అలాగే నన్నూరు సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి వర్గం సమీక్షించింది. రోడ్డు మార్గంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్, వీఐపీ మువ్‌మెంట్ రూట్‌మ్యాప్‌పై అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి మోడీ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దర్శనం అనంతరం శ్రీశైలంలో కూడా రోడ్‌షో నిర్వహించే అవకాశం ఉందని సమాచారం.



దానికనుగుణంగా భద్రతా ఏర్పాట్లు, గెస్ట్ మేనేజ్‌మెంట్, ప్రోటోకాల్ సమన్వయంపై అధికారులు వివరాలు సమర్పించారు.వ్యాపారులతో సమావేశం కూడాపర్యటనలో ప్రధానమంత్రి జీఎస్టీ, పారిశ్రామిక రంగాలపై వ్యాపారులతో ముఖాముఖి చర్చలు జరపనున్నారని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం కర్నూలు నగరంలోని వాణిజ్య భవనాలను పరిశీలించి తగిన ప్రాంగణం ఎంపిక చేయాలని ఆదేశించారు.కర్నూలు, నంద్యాల జిల్లాల పోలీస్ అధికారులు ప్రధాని పర్యటనలో త్రిస్థాయి భద్రతా కవచం అమలు చేయనున్నట్లు తెలిపారు. రహదారు ల పరిశీలన, సీసీ కెమెరా పర్యవేక్షణ, వీఐపీ మార్గాల శుభ్రపరిచే పనులు ప్రారంభించనున్నారు. సమగ్ర ప్రణాళికకు ఆదేశాలుసమావేశంలో మాట్లాడుతూ మంత్రులు జిల్లా అధికారులకు సమన్వయంతో, సమయపాలనతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచిం చారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా రూట్ డైవర్షన్‌లు, పార్కింగ్ ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి శాఖ ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యటన జిల్లాకు ప్రతిష్ఠాత్మకం. ప్రధానమంత్రి మోదీ పర్యటనతో కర్నూలు జిల్లా మరోసారి జాతీయ దృష్టిలో నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టు లు, పారిశ్రామిక పెట్టుబడుల ప్రకటనలు చేసే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి.కర్నూలు మోడీ పర్యటన అధికార యంత్రాంగం ఫుల్ యాక్షన్‌లో సర్క్యూట్ హౌస్ సమావేశం వ్యాప్తంగాఏర్పాట్ల సన్నాహాలు వేగంగా ప్రారంభమయ్యాయి.

# జైపూర్ ప్రమాదంపై అమిత్ షా విచారం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లేనని బాధితుల మండిపాటు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ హాస్పిటల్ ట్రామా సెంటర్‌లో జరిగిన ప్రమాదంపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఐసియు యూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు మరణించిన ఘటనపై అమిత్ షా 'ఎక్స్' లో స్పందించారు. మృతుల కుటుంబాలకు అమిత్ షా సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.సోషల్ మీడియా %ళ%లో రాసిన ఒక పోస్ట్‌లో అమిత్ షా.. 'జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదం విషాదకరం. రోగుల భద్రత, వారి చికిత్స, బాధితుల సంరక్షణ కోసం స్థానిక యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా సంతాపం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.' అని అమిత్ షా చెప్పారు.ఇలా ఉండగా, ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం



జరిగిందని ఆరోపిస్తూ బాధిత బంధువులు ఆసుపత్రి యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వంపై తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. జనం ఆస్పత్రి వెలుపల గుమిగూడి, హాస్పిటల్ సిబ్బంది.. యాజమాన్యం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఐసియులో షార్ట్ సర్క్యూట్ గురించి తెలియజేసినప్పుడు ఆసుపత్రి సిబ్బంది ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిరసనకారులు ఆరోపించారు.. సమాచారం ఇచ్చినప్పటికీ వారు మా మాట వినలేదని వాపోయారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణం గా తమ ప్రియమైన వారిని కోల్పోయామని కన్నీటి పర్యంతమయ్యారు. వాళ్లు బాధ్యతగా వ్యవ హరించి ఉంటే, ప్రాణాలు పోయే పరిస్థితి ఉండేది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవై పు, ఐసియులో చేరిన రోగుల బంధువులు ఆ ప్రమాద క్షణాల్లో ఏం జరిగిందో చెప్పారు. 'స్పార్క్ వచ్చినప్పుడు, దాని పక్కన ఒక సిలిండర్ ఉంది. పొగ ఐసియు అంతటా వ్యాపించింది. దీనివల్ల అందరూ భయాందోళనకు గురై పారిపో యారు. కొందరు తమ సొంత వాళ్లని రక్షించగలిగారు, అక్కడ మంటలు ఆర్పటానికి ఎలాంటి పరికరాలు కనిపించలేదు. ఇదే చాలా మంది అనడం మాకు వినిపించింది.' అని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# సీజేఐ బీఆర్ గవాయ్‌పై అటాక్


**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో సీజేఐ బీఆర్ గవాయ్‌పై ఓ లాయర్ తన షూ విసిరేందుకు ప్రయత్నించారు. సీజేఐ కూర్చున్న డయాస్ వద్దకు ఓ లాయర్ వెళ్లి.. తన కాలుకున్న షూను తీసి, జడ్జి మీదకు విసిరే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఓ కేసు వాదనల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే అక్కడే ఉన్న సెక్యూర్టీ సిబ్బంది వెంటనే కలగజేసుకుని ఆ లాయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని బయటకు తీసుకెళ్లారు. ఆ లాయర్‌ను కిషోర్ రాకేశ్‌గా గుర్తించారు. కోర్టు రూమ్ నుంచి బయటకు తీసుకెళుతున్న సమయంలో.. ఆ లాయర్ సనాతన ధర్మంపై నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. సనాతన్ కా అప్మాన్ నహీ సహింగే.. సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదని ఆ లాయర్ అన్నారు.సీజేఐ గవాయ్ మాత్రం ఆ ఘటన పట్ల ఎటువంటి అధైర్యానికి లోనుకాలేదు. కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని కోరారు. ఇలాంటి వాటి వల్ల ఎవరూ విచలితులు కావొద్దు అని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని సీజేఐ గవాయ్ పేర్కొన్నారు. అయితే కొన్ని రోజుల క్రితం సీజేఐ గవాయ్.. ఓ కేసులో



చేసిన వ్యాఖ్యల వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఖజురహోలోని ఏడు అడుగల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన కేసులో సీజేఐ గవాయ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును ఆయన డిస్మిస్ చేస్తూ వెళ్లి ఆ దేవుడినే అడుక్కోవాలన్న కామెంట్ చేశారు. విష్ణువుకు వీరభక్తుడిని అని చెప్పుకుంటున్నావు కాదా, వెళ్లి ఆ దేవుడినే ప్రార్థించుకో, అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఏఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సీజేఐ వ్యాఖ్యానించారు.ఖజురహో కేసులో సీజేఐ గవాయ్ చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో తీవ్ర దుమారం చెలరేగింది. మతపరమైన భావాలను కించపరిచినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ వివాదానికి ఆయన తనదైన స్టయిల్‌లో తెరించారు. రెండు రోజుల తర్వాత ఓ కేసులో స్పందిస్తూ తానేమీ ఏ మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొ న్నారు.కేంద్ర ప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీజేఐకి అండగా నిలిచారు. సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయన్నారు.

# కటక్‌లో మళ్లీ హింస- 25మందికి గాయాలు

**కటక్:** ఇటీవల దుర్గా మాత నిమజ్జన సందర్భంగా రెండు వర్గాలు మధ్య ఘర్షణలు జరిగిన తర్వాత ఒడిశాలోని కటక్‌లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆదివారం బైక్ ర్యాలీకి అనుమతి నిరాకరించడంతో పోలీసులు, ఓ సంస్థ సభ్యులు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలో 25మంది గాయపడ్డారు. వారిలో ఎనిమిది మంది పోలీసులు ఉన్నారు. దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, 36 గంటలపాటు కర్ఫ్యూ విధించిందిశనివారం తెల్లవారుజామున కటక్‌లోని దుర్గా బజార్ ప్రాంతంలో నిమజ్జన ఊరేగింపు సమయంలో మొదటిసారిగా హింస చెలరేగింది. అర్ధరాత్రి వేళ పెద్ద శబ్దంతో పాటలు పెట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఊరేగింపులో పాల్గొన్న వారు ప్రతిఘటించడంతో హింస చెలరేగింది. ఈ గందరగోళంలో కటక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఖిలారి రిషికేశ్ సహా పలువురు గాయపడ్డారు. ఆ తర్వాత పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కటక్ నగరంలో ఆంక్షలు విధించారు. ఆ తర్వాత హిందూ పరిషత్ సంస్థ ఆదివారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించడంతో మళ్లీ ఉద్రికత్త పరిస్థితులు తలెత్తాయి.బైక్ ర్యాలీకి అనుమతి నిరాకరిచడంతో ఈ ఘర్షణలు తలెత్తినట్లు కటక్ పోలీస్ కమిషనర్ సురేశ్ దేవదత్త సింగ్ తెలిపారు. 'ఆదివారం కటక్‌లో బైక్ ర్యాలీకి హిందూ పరిషత్ సంస్థ అనుమతి కోరింది. కానీ మతపరమైన ఉద్రికత్తలు



తలెత్తే ప్రమాదం కారణంగా అనుమతి ఇవ్వలేదు. అయినా ఆ సంస్థ ర్యాలీకి రావడం వల్ల భద్రతా సిబ్బంది వారికి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఆ సంస్థ సభ్యులు ఘర్షణలకు దిగారు. పోలీసులపై రాళ్లతో దాడి చేశారు. అంతేకాకుండా పలు వాహనాలకు నిప్పంటించారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు ఉపయోగించి వారిని చెదరగొట్టారు. ఈ దాడిలో ఎనిమిది మంది పోలీసులతో సహా 25 మంది గాయపడ్డారు. శనివారం దుర్గామాత నిమజ్జన సమయంలో జరిగిన రాళ్ల దాడిలో ఎవరూ మరణించలేదు. నలుగురు గాయపడగా, ముగ్గురిని అదే రోజు డిశ్చార్జ్ చేశారు. ఒకరు మాత్రమే ఇంకా చికిత్స పొందుతున్నారు. ప్రాణాలు కోల్పోయారు అనేవి తప్పుడు వార్తలే. వాటిని వ్యాప్తి చేసే వారిపై చర్య తీసుకుంటాం' అని సురేశ్ దేవదత్త సింగ్ పేర్కొన్నారు.ఈ ఘర్షణలు కారణంగా 13 ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరిం చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. 'ఆదివారం సాయంత్రం ఘర్షలు జరగడం వల్ల ఇంటర్నెట్ సేవలను నిలిపివేశాం. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. ఆదివారం సాయంత్రం సమయంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కూడా గాయపడ్డారు. అందుకే నగరంలో 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశాం. తక్షణమే కర్ఫ్యూ అమలు చేశాం. అవసరమైతే మరో 24 గంటలు పొడిగిస్తాం. ఇప్పటికే పది కంపెనీల పోలీసు బలగాలు మెహరించాం. అదనంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ నుంచి మూడు ప్లాటూన్లు కూడా వచ్చాయి' అని తెలిపారు.శాంతి భద్రతలు కాపాడాలని సీఎం విజ్ఞప్తిఈ ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, మాజీ సీఎం, బిజేడీ అధినేత నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. కటక్ నగరపు శతాబ్దాల నాటి సంస్కృతిని కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'కటక్ వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన నగరం. ఇది ఐక్యతకు, మత సామరస్యానికి ప్రసిద్ధి. కొందరి చర్యల కారణంగా ఇటీవల శాంతికి భంగం కలిగింది. ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం ' అని సీఎం ఓ ప్రకటనలో తెలిపారు

# దక్షిణ చైనా సముద్రంలో ఐఎన్ఎస్ సహ్యాద్రి మోహరింపు

**న్యూఢిల్లీ:** భారతీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ సహ్యాద్రిదక్షిణ చైనా సముద్రంలో మోహరిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో.. ఆ వివాదాస్పద జలాల్లో భారతీయ యుద్ధ నౌక సంచరించడం ఇది రెండో సారి. ప్రస్తుతం ఐఎన్ఎస్ సహ్యాద్రి మూడు రోజుల పాటు మలేషియాలో ఉన్నట్లు నేవీ ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ చైనా సముద్రంలో ఈస్టర్న్ ఫ్లీట్ ను డిప్లాయ్ చేస్తున్నారని, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కూడా యుద్ధ నౌకల మోహరింపును బలపేతం చేస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. ఐఎన్ఎస్ సహ్యాద్రి బాధ్యతాయుతంగా ఆపరేషనల్ డిప్లాయ్‌మెంట్‌లో పాల్గొన్నదని, ఇండో-పసిఫిక్ సముద్ర ప్రాంతంలో సెక్యూర్టీ భాగస్వామి బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు నేవీ పేర్కొన్నది.రెండు వారాల క్రితమే మరో యుద్ధ నౌక ఐఎన్ఎస్ నిస్తార్ ఇండో పసిఫిక్ రీచ్‌లో పాల్గొన్నది.



పది రోజుల పాటు ఆ ఈవెంట్ జరిగింది. సింగపూర్ వేదికగా జరిగిన పసిఫిక్ రీచ్ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశ నౌకలు కూడా పాల్గొన్నాయి. దక్షిణ చైనా సముద్ర జలాలపై చైనా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది. అయితే మలేషియాతో పాటు మరో అయిదు దేశాలు ఆ జలాలపై చైనాతో గొడవపడుతున్నాయి. ద్వైపాక్షిక ప్రయోజనాల దృష్ట్యా.. ప్రాంతీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయనున్నట్లు నేవీ పేర్కొన్నది.గైడెడ్ మిస్సైల్ స్టీల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ సహ్యాద్రి గతంలో రెం డు సార్లు మలేషియాకు వెళ్లింది. గుడ్‌విల్ మిషన్‌లో భాగంగా 2016లో పోర్ట్ క్లాంగ్‌కు వెళ్లింది. 2019లో సముద్ర లక్ష్మణ విన్యాసాల్లోకోట కినబాలు డాక్‌యార్డుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

# అమెరికాతో సమస్య పరిష్కారం కావాల్సి ఉంది

**న్యూఢిల్లీ:** అమెరికా ఇటీవల కాలంలో భారత్‌పై విధించిన సుంకాలపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మరోసారి స్పందించారు. ఈ సుంకాల సమస్య పరిష్కారం కావాల్సి ఉందని, అందుకోసం వాషింగ్టన్‌తో చర్చలు జరుపుతున్నట్లు మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. దిల్లీలో జరిగిన కౌటిల్య ఆర్థిక సదస్సులో పాల్గొన్న ఆయన భారత్- అమెరికా మధ్య పరిణితితో కూడిన బలమైన సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అయితే వాణిజ్యం, ఇంధన సహకారం విషయాల్లో ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు.దాని వల్ల భారత్‌పై వాషింగ్టన్ విధించిన సుంకాలు అన్యాయమని బహిరంగంగా పేర్కొన్నట్లు జైశంకర్ చెప్పారు. రష్యా నుంచి చమురు దిగుమతుల నేపథ్యంలో అమెరికా రెండోవిడత సుంకాలు విధించిందని, అదే సమయంలో మాస్కోను వ్యతిరేకిస్తున్న దేశాలు కూడా అదేపని చేస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాతో వాణిజ్యం ఒప్పందం చేసుకోవాల్సి ఉందని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అన్నారు.'అవును,



అమెరికాతో మనకు సమస్యలు ఉన్నాయి. వాణిజ్య చర్చలు ఓ కొలిక్కి రాలేదన్నది నిజం. ఇప్పటివరకు వాణిజ్య ఒప్పందం జరగనందున మనపై సుంకాలు విధించటానికి దారితీసింది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు మనపై విధించిన రెండోవిడత సుంకాలు అన్యాయమని బహిరంగంగా చెప్పాం' అని ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.ట్రంప్ సుంకాల దాడిఇటీవల కొంతకాలం నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం భారత్?ను లక్ష్యంగా చేసుకున్నారు. భారత్, చైనా దేశాలు చమురు కొనడం వల్లనే రష్యా, ఉక్రెయిన్?తో యుద్ధాన్ని కొనసాగించగలుగుతోందని తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. ఎన్నో ప్రాణాలు పోతున్నా భారత్? పట్టించుకోవడం లేదని విమర్శించారు. అయితే చైనాను ఏమీ చేయలేక, భారత్?పై సుంకాల దాడి చేశారని ఆరోపించారు.తొలుత 25 శాతం మేర ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్, తర్వాత పెనాల్టీగా మరో 25 శాతం సుంకాలు వేశారు. దీనితో భారత్?పై ఏకంగా 50 శాతం మేర సుంకాల భారం పడింది. ట్రంప్ అక్కడితో ఆగకుండా రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని భారత్?పై నిరంతరం ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. రీసెంట్?గా హెచ్? 1బీ వీసాపై సైతం లక్ష డాలర్ల ఫీజు అమలు ఉత్తర్వులపై సంతకం చేశారు.

# వరద బాధితులకు సాయం చేస్తుండగా దాడి ఎంపీకి తీవ్ర గాయాలు

**పశ్చిమ బెంగాల్ :** వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్లిన ఓ బీజేపీ ఎంపీ కి షాకింగ్ అనుభవం ఎదురైంది. స్థానికుల దాడిలో సదరు ఎంపీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సోమవారం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. బెంగాల్‌లోని మాల్దాహా లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన ఎంపీ ఖాగెన్ ముర్ము సోమవారం మధ్యాహ్నం వరద ప్రభావిత



జల్పైగురి ప్రాంతంలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే శంకర్ ఘోష్, ఇతర బీజేపీ నాయకులతో కలిసి వరద బాధితులకు సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిపై స్థానికులు కొందరు దాడి చేశారు. ఈ దాడిలో ఖాగెన్ ముర్ము తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. బీజేపీ నేతలు వెంటనే ఎంపీని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇది రాష్ట్రంలో అధికారంలో ఉన్న తృణమూల్ నేతల పనే అని ఆరోపించింది.

# 'డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం చేశాడు' సహ విద్యార్థిపై ఎంబీబీఎస్ విద్యార్థిని ఫిర్యాదు

**న్యూఢిల్లీ:** ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని సహ విద్యార్థిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫ్రెండ్‌షిప్ పేరుతో హెూటల్‌కు రప్పించి డ్రగ్స్ ఇచ్చి తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. హర్యానాలోని జింద్‌కు చెందిన 18 ఏళ్ల యువతి ఢిల్లీలోని బాబా సాహెబ్ అంబేద్కర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్



చదువుతున్నది. కాలేజీ హాస్టల్ క్యాంపస్‌లో ఆమె నివసిస్తున్నది.కాగా, తోటి మెడికల్ స్టూడెంట్ అయిన 20 ఏళ్ల యువకుడు సెప్టెంబర్ 9న స్నేహం పేరుతో ఆదర్శ్‌నగర్‌లోని హెూటల్‌కు తనను రప్పించాడని ఆ యువతి తెలిపింది. హెూటల్ రూమ్‌లో తనకు మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తన ఫొటోలు తీసి, వీడియో రికార్డ్ చేసి బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.మరోవైపు వైద్య విద్యార్థిని ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడైన తోటి మెడికో కోసం వెతుకున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# జల్‌పాయ్‌గురిలో బీజేపీ ప్రతినిధి బృందంపై దాడి. గాయపడిన ఎంపీ

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ప్రతినిధి బృందంపై సోమవారంనాడు దాడి జరిగింది. జల్‌పాయ్‌గురి జిల్లాలో బీజేపీ ప్రతినిధుల కాన్వాయ్‌పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో మాల్దా ఉత్తర్ ఎంపీ ఖగెన్ ముర్ము తీవ్రంగా గాయపడ్డారు. సిలిగురి



ఎమ్మెల్యే శంకర్ ఘోష్ సైతం గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. దాడిలో ఈ ఇద్దరు నేతలు ప్రయాణిస్తున్న వాహనాలు సైతం దెబ్బతిన్నాయి.టీఎంసీ పనే: బీజేపీసహాయక చర్యలు పర్యవేక్షించేందుకు వెళ్తున్న తమ పార్టీ ప్రతినిధి బృందంపై దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఉందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. 'టీఎంసీ గూండాలు నార్త్ మాల్దాకు రెండుసార్లు ఎంపీగా ఉన్న ఖగెన్ ముర్ముపై దాడి చేశారు. కోల్‌కతా కార్నివాల్‌లో మమతా బెనర్జీ మునిగిపోయారు. టీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం వరద సహాయక చర్యలను పట్టించుకోవడం లేదు. బీజేపీ నేతలు, కార్యకర్తలు మాత్రమే బాధితులను ఆదుకుంటున్నారు. టీఎంసీ బెంగాల్‌లో క్రూరత్వం రాజ్యమేలుతోంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.ఖగెన్ ముర్ము ఎవరు?మాల్దా ఉత్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీగా ఆయన రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2006 నుంచి 2019 వరకూ హబీబ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన సేవలందించారు. నిజానికి ఆయన సీపీఎం సభ్యుడైనప్పటికీ 2019లో ఆయన పార్టీని విడిచిపెట్టారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు

# ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం



**ఫ్రాన్స్:** ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధానిసెబాస్టియన్ లెకోర్ను తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు. గత నెల జాతీయ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే.ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. నేడు మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది.కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.

# సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ పై టీమిండియా కన్ను

- టీమిండియా కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు!
- బుమ్రాకు రెస్ట్ ఇచ్చి ప్రసిధ్ కృష్ణకు అవకాశం!





వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన భారత్.. ఆఖరి పోరుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఢిల్లీ వేదికగా రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. ఏకపక్షంగా సాగిన తొలి టెస్ట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన భారత్.. ఇన్నింగ్స్ 140 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు వెస్టిండీస్ ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మరోవైపు వెస్టిండీస్ బౌలర్లను భారత బ్యాటర్లు చితక్కొట్టారు. ఆఖరి టెస్ట్‌లోనూ ఇదే జోరును కొనసాగించి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు టీమిండియా కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు రెస్ట్ ఇచ్చి ప్రసిధ్ కృష్ణకు అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలోని వన్డే సిరీస్‌కు ఎంపికైన ప్రసిధ్ కృష్ణకు గేమ్ టైమ్ ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ సిరాజ్‌కు రెస్ట్ ఇవ్వాలనుకుంటే బుమ్రా జట్టులో కొనసాగుతాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసిన బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లు సాధించలేకపోయాడు.మరోవైపు ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ క్రికెట్ స్టేడియం స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. ఈ క్రమంలోనే టీమిండియా ఎక్స్‌ట్రా స్పిన్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగనుంది. పేస్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో అక్షర్ పటేల్ బరిలోకి దిగే అవకాశం ఉంది. తొలి టెస్ట్‌లో నితీష్ కుమార్ రెడ్డి కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు. అయితే అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. తొలి టెస్ట్‌లో విఫలమైన సాయి సుదర్శన్‌ను తప్పించి దేవదత్ పడిక్కల్‌కు అవకాశం కల్పించే ఛాన్స్ ఉంది. అయితే ఒకే ఇన్నింగ్స్ వైఫల్యానికి సాయి సుదర్శన్‌ను పక్కనపెడుతారా అంటే అవుననే కచ్చితంగా చెప్పలేం. మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు.వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు(అంచనా):యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, ధ్రువ్ జురెల్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్

# విరాట్-రోహిత్‌కు బీసీసీఐ అల్టిమేటం!

**వరల్డ్ కప్ 2027లో చోటు కోసం షరతులు!**

భారత క్రికెట్‌లో పెద్ద మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మొదట కెప్టెన్సీ బాధ్యతను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించారు, ఇప్పుడు %దీజజ×% జట్టులోని ఇద్దరు అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విషయంలో కఠినంగా వ్యవహరించింది. ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడకపోతే, 2027 ప్రపంచ కప్ ఎంపికలో వారిని చేర్చుకోబోమని బోర్డు స్పష్టం చేసింది. ప్రధాన సెలెక్టర్ అజిత్ అగార్కర్ అక్టోబర్ 5న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎంపిక ప్రక్రియ ఇప్పుడు పూర్తిగా ప్రదర్శన ఆధారంగా ఉంటుందని అన్నారు. "అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాలని మేము ఆటగాళ్లకు స్పష్టంగా చెప్పాము. ఈ నియమం అందరికీ వర్తిస్తుంది" అని ఆయన అన్నారు.విజయ్ హజారే ట్రోఫీ వంటి టోర్నమెంట్లు ఇప్పుడు ఎంపికకు ముఖ్యమైన ఆధారాలుగా మారతాయని అగార్కర్ తెలిపారు. అంటే పేరు లేదా అనుభవం మాత్రమే కాదు, మైదానంలో ఇటీవలి ప్రదర్శన



కూడా ఆటగాళ్ల స్థానాన్ని నిర్ణయిస్తుంది.గత కొన్ని సంవత్సరాలుగా విరాట్, రోహిత్ తరచుగా విశ్రాంతి లేదా విరామం తీసుకుంటూ కనిపించారు. ఈ సమయంలో వారు దేశవాళీ టోర్నమెంట్ల నుంచి దూరంగా ఉన్నారు, అయితే యువ ఆటగాళ్ళు అక్కడ తమ స్థానాన్ని సంపాదించడానికి కష్టపడ్డారు, కానీ ఇప్పుడు %దీజజ×% ఏ ఆటగాడైనా, ఎంత పెద్ద పేరున్న ఆటగాడైనా దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండకూడదని స్పష్టం చేసింది.ప్రపంచ కప్ 2027లో ఆడాలంటే ఇప్పుడు విరాట్, రోహిత్ మళ్లీ తమ ఆటతో తాము నిరూపించుకోవాలి. ఇద్దరు ఆటగాళ్లు ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే చురుకుగా ఉన్నారు, ఎందుకంటే వారు ఇప్పటికే టెస్ట్, టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. కాబట్టి వారి పూర్తి దృష్టి పరిమిత ఓవర్లపై ఉంటుంది, అయితే సెలెక్టర్ల సందేశం స్పష్టంగా ఉంది, సీనియారిటీ కాదు, పనితీరు మాత్రమే జట్టులో చేరేందుకు పాస్‌పోర్ట్ అవుతుంది.కెప్టెన్సీని శుభ్‌మన్ గిల్‌కు అప్పగించి కఠినమైన ఎంపిక విధానాన్ని అవలంబించడం ద్వారా, భారత క్రికెట్ భవిష్యత్తు యువ, ఫిట్‌గా ఉండే ఆటగాళ్ల చేతుల్లో ఉంటుందని బోర్డు సందేశం ఇవ్వాలనుకుంటోంది. ఈ నిర్ణయం అభిమానులకు ఆశ్చర్యం కలిగించవచ్చు, కానీ ఇది భారత జట్టులో పోటీని, పారదర్శకతను పెంచుతుంది.మరోవైపు చాలా రోజుల తర్వాత వన్డే ఆడబోతున్న విరాట్, రోహిత్ కోసం అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అందుకే ఆస్ట్రేలియాలో జరిగే వన్డే సిరీస్ టికెట్ల కోసం ఎగబడుతున్నారు. భారత్ %జం% ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తుంది. ఇప్పుడు వన్డే జట్టులోకి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తిరిగి రాకతో ఈ పోటీపై మరింత ఆసక్తి ఏర్పడింది. అక్టోబర్ 25, 2025న ఐకానిక్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే మూడో వన్డే కోసం టికెట్లు ఆన్‌లైన్‌లో పెట్టారు. గంటల వ్యవధిలోనే టికెట్లు అమ్ముడైపోయాయి.

# భారత్ -పాకిస్థాన్ మ్యాచ్‌లో వింతైన సంఘటనలు

2025 మహిళల ప్రపంచ కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. సాధారణంగా ఇండో- పాక్ మ్యాచ్ అంటేనే కాంట్రవర్సీలు ఉంటాయి. తాజాగా మహిళల మ్యాచ్‌లోనూ ఇలాంటి సంఘటనలే జరిగాయి. ఈసారి భారత్- పాక్ మ్యాచ్‌లో ఒకటి,రెండు కాదు నాలుగు వింత సంఘటనలు జరిగాయి.2025 ఆసియా కప్‌లో పాక్ ఆటగాళ్లతో భారత పురుషుల జట్టు కరచాలనం చేయలేదు. అదే విధానాన్ని భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫాలో అయ్యింది. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ ఫాతిమా సనాతో కరచాలనం చేయలేదు. కనీసం ఒకరినొకరు చూసుకోలేదు.టాస్ సమయంలో ఇంకో అనూహ్యమైన సంఘటన జరిగింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కాయిన్‌ను గాల్లోకి విసిరినప్పుడు, పాక్ కెప్టెన్ ఫాతిమా టెయిల్స్ అని కాల్ ఇచ్చింది. అయితే, మ్యాచ్ రిఫరీ షాంద్రే ఫ్రిట్జ్ మాత్రం ఆమె హెడ్స్ అన్నట్లుగా చెప్పింది. టాస్ కూడా అనుకూలంగా రావడంతో ఫాతిమా అక్కడ జరిగిన పొరపాటును చెప్పే ప్రయత్నం చేయలేదు.ఈ



మ్యాచ్‌లో మైదానం పురుగులతో నిండిపోయింది. దీని వల్ల ఆటకు అంతరాయం ఏర్పడింది. దాదాపు పావుగంట మ్యాచ్ ఆగిపోయింది. సిబ్బంది వచ్చి పిచికారి కొట్టి పురుగులను వెళ్లగొట్టారు. ఆ తర్వాత మ్యాచ్ ప్రారంభం అయ్యింది.మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ మునిబా అలీ రనౌట్ వివాదాస్పదం అయ్యింది. పాక్ ఇన్నింగ్స్‌లో నాలుగో ఓవర్ చివరి బంతికి మునీబ్ అలీని థర్డ్ అంపైర్ రనౌట్‌గా ప్రకటించాడు. నిజానికి, క్రాంతి గౌర్ వేసిన బంతి మునీబా ప్యాడ్‌ను తాకి గల్లీలోకి ఎగిరింది. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న దీప్తి శర్మ బంతిని తీసుకొని స్టంప్స్‌పైకి విసిరింది. మునీబా క్రీజు లోపల తన బ్యాట్‌ను పైకెత్తి చూస్తుండగా అది ఆమెకు తగిలింది. ఆ తర్వాత థర్డ్ అంపైర్ ఆమెను ఔట్‌గా ప్రకటించాడు. ఇది కాస్త కాంట్రవర్సీ అయ్యింది.పాక్‌పై టీమ్ఇండియా 88 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. 248 పరుగుల ఛేదనలో దిగిన పాకిస్థాన్ 43 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పాక్ బ్యాటర్లలో సిద్రా అమిన్ (81 పరుగులు) రాణించింది. ఆమెనే పాక్‌లో టాప్ స్కోరర్. సిద్రా పోరాటంతో పాక్ గేమ్‌లోకి వచ్చినట్లు కనిపించింది. కానీ ఆమెను స్నేహ్ రానా అద్భుత బంతిలో బోల్తా కొట్టించింది. భారత్ బౌలర్లలో క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో 3, స్నేహ్ రానా 2 వికెట్లు దక్కించుకున్నారు.ఈ విజయంతో భారత్ పాయింట్స్ టేబుల్‌లో టాప్‌లోకి దూసుకెళ్లింది. ఇప్పటికి రెండు మ్యాచ్‌లు ఆడిన టీమ్ఇండియా రెండింట్లోనూ నెగ్గింది.

# టీ20లో విధ్వంసం సృష్టించిన ఉర్విల్ పటేల్



కేవలం 28 బంతుల్లోనే సెంచరీ సాధించి టీ20 క్రికెట్‌లో ఒక ఉత్కంఠభరితమైన భారత బ్యాట్స్‌మన్ సంచలనం సృష్టించాడు. భూకంపం వచ్చినట్లుగా ఈ భారత బ్యాట్స్‌మన్ క్రికెట్ మైదానంలో విధ్వంసం సృష్టించాడు. ఈ ప్రమాదకరమైన బ్యాట్స్‌మన్ బ్యాటింగ్ తో ప్రత్యర్థి జట్టు బౌలర్లు చేతులు ఎత్తేశారు. ఈ భారత బ్యాట్స్‌మన్ తన చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లో సిక్సర్ల వర్షం కురిపించి సత్తా చాటాడు.భారత 26 ఏళ్ల తుఫాన్ బ్యాట్స్‌మన్ ఉర్విల్ పటేల్ టీ20 క్రికెట్‌లో ఈ మైలురాయిని సాధించాడు. సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ (%వాహీూ%) 2024-25 సీజన్‌లో గుజరాత్ తరపున ఆడిన ఉర్విల్ పటేల్, నవంబర్ 27, 2024న త్రిపురతో జరిగిన టీ20 మ్యాచ్‌లో 28 బంతుల్లో సెంచరీ సాధించాడు. మొత్తం టీ20 క్రికెట్‌లో ఇది ఒక భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీ ఇదే కావడం గనమార్హం. ఉర్విల్ పటేల్ 28 బంతుల్లో సెంచరీ సాధించి 35 బంతుల్లో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఉర్విల్ పటేల్ 322.85 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ 12 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. ఈ రికార్డుతో, ఐపీఎల్‌లో 30 బంతుల్లో సెంచరీ చేసిన క్రిస్ గేల్ రికార్డును ఉర్విల్ పటేల్ అధిగమించాడు. ఇండోర్‌లో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో, త్రిపుర ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 155/8 పరుగులు చేసింది. త్రిపుర గుజరాత్‌కు విజయానికి 156 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చింది. దీనికి సమాధానంగా, గుజరాత్ 10.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 156 పరుగులు చేసి 58 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.కొన్ని రోజుల తర్వాత, భారత బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ ఉర్విల్ పటేల్ ఘనతను పునరావృతం చేశాడు. ఉర్విల్ పటేల్ ఘనత తర్వాత, శర్మ డిసెంబర్ 5, 2024న సయ్యద్ ముష్తాక్ అలీ టీ20 ట్రోఫీ 2024 టోర్నమెంట్‌లో మేఘాలయపై 28 బంతుల్లో సెంచరీ సాధించాడు. మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో శర్మ 29 బంతుల్లో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. ఈ కాలంలో అతని స్ట్రైక్ రేట్ 365.51గా నిలిచింది.సాహిల్ చౌహాన్ ప్రస్తుతం టీ20 క్రికెట్, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డును కలిగి ఉన్నాడు. జూన్ 17, 2024న, ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ సైప్రస్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 27 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. చౌహాన్ 41 బంతుల్లో 144 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

# 221 పరుగులతో వైభవ్ సూర్యవంశీ శివతాండవం



వైభవ్ సూర్యవంశీ అండర్-19 క్రికెట్ కెరీర్ జోరుమీదుంది. అతను గత సంవత్సరం భారత అండర్-19 జట్టుతో అరంగేట్రం చేశాడు. కానీ, ఇప్పటివరకు ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుతో అతను ఆడిన క్రికెట్ చూస్తే.. అతను సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి ఆటగాళ్ల మాదిరిగానే కంగారూలతో ఆడటం ఆనందిస్తున్నాడని సూచిస్తుంది. ప్రత్యేకంగా రెడ్-బాల్ క్రికెట్ గురించి మాట్లాడితే, అంటే, మల్టీ-డే మ్యాచ్‌ల్లో చెలరేగిపోతున్నాడు. భారత అండర్-19 జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. అక్కడ అక్టోబర్ 7 నుంచి ప్రారంభమయ్యే రెండవ మల్టీ-డే మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో ఇది చివరి మ్యాచ్ కూడా అవుతుంది.వైభవ్ సూర్యవంశీ మ్యాచ్ గణాంకాలను పరిశీలిస్తే, అతను ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుపై తన ఎక్కువ పరుగులు ఎలా సాధించాడో మీకు అర్థమవుతుంది. అంతే కాదు, అతని అత్యధిక సెంచరీలు, అత్యధిక సిక్సర్లు, బహుళ-రోజుల మ్యాచ్‌లలో ఉత్తమ సగటు కూడా ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుపైనే ఉన్నాయి.వైభవ్ సూర్యవంశీ తన అండర్-19 కెరీర్‌లో ఐదు మల్టీ-డే మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో మూడు ఆస్ట్రేలియా అండర్-19తో, రెండు ఇంగ్లాండ్‌తో జరిగాయి. ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మ్యాచ్‌లలో, అతను 55.25 సగటుతో 221 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్‌పై అతని సగటు 22.50 మాత్రమే.వైభవ్ సూర్యవంశీ తన అండర్-19 మల్టీ-డే మ్యాచ్ కెరీర్‌లో మొత్తం 15 సిక్సర్లు కొట్టాడు. వాటిలో 12 ఆస్ట్రేలియాపైనే వచ్చాయి. అంటే, అతను ఇంగ్లాండ్‌పై కేవలం మూడు సిక్సర్లు మాత్రమే కొట్టాడు. ఈ 12 సిక్సర్లతో పాటు, వైభవ్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో 23 ఫోర్లు కూడా కొట్టాడు.వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు మల్టీ-డే మ్యాచ్‌లలో రెండు సెంచరీలు సాధించాడు. రెండూ ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగినవే. అతను ఆ సెంచరీలలో ఒకదాన్ని భారత గడ్డపై తన తొలి ఇన్నింగ్స్‌లోనే సాధించగా, రెండవది ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో వచ్చింది.

# భారత జట్టు ఎక్కువగా వన్డేలు ఆడే అవకాశం లేదు

**ద్వైపాక్షిక పర్యటనల్లో టెస్ట్‌లు, టీ20లు ఎక్కువ**

**వన్డే ప్రపంచకప్ 2027 ఆడే విషయంపై క్లారిటీ లేదు**

**అందుకే కెప్టెన్సీ నుంచి రోహిత్ శర్మను తప్పించారు**

**దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు**

వన్డే ప్రపంచకప్ 2027 ఆడే విషయంపై క్లారిటీ లేకపోవడంతోనే టీమిండియా వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించారని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అన్నాడు. ఇది సరైన నిర్ణయమేనని చెప్పిన గవాస్కర్.. భవిష్యత్తులో బ్యాడ్ న్యూస్ వినేందుకు అభిమానులు సిద్ధంగా ఉండాలని హెచ్చరించాడు. అంతర్జాతీయ వన్డేల షెడ్యూల్ నేపథ్యంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వన్డే ప్రపంచకప్ 2027 ఆడటం సందేహంగా మారిందని చెప్పాడు.తాజాగా ఓ జాతీయ స్పోర్ట్స్ ఛానెల్‌తో మాట్లాడిన గవాస్కర్.. కోహ్లీ, రోహిత్ వన్డే ప్రపంచకప్ 2025 ఆడాలంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని చెప్పాడు. 'వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో రోహిత్ శర్మ ఆడుతాడో లేదో తెలియదు. ప్రస్తుతం అతను వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్యాలెండర్‌ను చూస్తే.. భారత జట్టు ఎక్కువగా వన్డేలు ఆడే అవకాశం లేదు. ద్వైపాక్షిక పర్యటనల్లో ఎక్కువగా టెస్ట్‌లు, టీ20లు ఉన్నాయి.ఏడాదికి 5-7 వన్డేలు మాత్రమే ఆడితే.. ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీకి కావాల్సిన ప్రాక్టీస్ లభించదు. జట్టులో అతని స్థానంపై స్పష్టత లేకపోవడంతోనే శుభ్‌మన్ గిల్‌ను సారథిగా సిద్ధం చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. జట్టు ఆలోచనే ఇది. వ్యక్తిగతంగా రోహిత్ చాలా సాధించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచకప్‌ను గెలిపించాడు. అతని కెప్టెన్సీ గురించి మరో ఆలోచన లేదు.

మంగళవారం,
అక్టోబర్ 07, 2025

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



## 'మాస్ జాతర' నుంచి రొమాంటిక్ ట్రీట్..
# కొత్త పాట ప్రోమో విడుదల



మాస్ మహారాజా రవితేజ, యంగ్ సెన్సేషన్ శ్రీలీల జంటగా నటిస్తున్న 'మాస్ జాతర' సినిమా నుంచి మరో అప్‌డేట్ వచ్చింది. సినిమా ప్రమోషన్లలో భాగంగా, చిత్ర యూనిట్ 'హుడియో.. హుడియో' అనే రొమాంటిక్ పాట ప్రోమోను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ ప్రోమో సోషల్ మీడియాలో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పాట ప్రోమోలోని రొమాంటిక్ బీట్స్, విజువల్స్ యూత్‌ను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా, ఇందులో శ్రీలీల లంగావోణీలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచి, హేషమ్ అబ్దుల్ వహాబ్‌తో కలిసి ఆలపించిన ఈ పాటకు దేవ్ సాహిత్యం అందించారు. పూర్తి పాటను అక్టోబర్ 8న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో అభిమానులు పూర్తి పాట కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
భాను బోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో, ప్రమోషన్ల వేగాన్ని పెంచిన చిత్ర బృందం వరుస అప్‌డేట్లతో సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# నాగశౌర్య కొత్త సినిమా
# బ్యాడ్ బాయ్ కార్తీక్
### టీజర్ విడుదల చేసిన మేకర్స్

నాగశౌర్య ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథతో దీనిని తెరకెక్కించినట్లు టీజర్ ఆధారంగా అర్థమవుతోంది. నటి పూర్ణ సీరియస్ లుక్‌లో కనిపించగా.. సాయి కుమార్ పోలీస్ పాత్రలో తనశైలిలో డైలాగ్ చెప్పారు. ఛలో సినిమాతో సూపర్ హిట్ అందుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ వచ్చిన నాగశౌర్య కొంత కాలంగా సైలెంట్ అయ్యాడు. చివరిగా 2023 లో రంగబలి అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆ సినిమా కూడా యావరేజ్ టాక్ తెచ్చుకుంది. దాంతో సినిమాలకు లాంగ్ గ్యాప్ ఇచ్చేసాడు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులని అలరించటానికి వస్తున్నాడు. నూతన దర్శకుడు రామ్ దేశిన దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఎప్పుడో ప్రకటించాడు శౌర్య. ఎప్పటినుండో సెట్స్ పై ఉన్న ఈ సినిమా టీజర్ ను ఈ రోజు రిలీజ్ చేసారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా బ్యాడ్ బాయ్ కార్తీక్ టీజర్ ను రిలీజ్ చేసారు. భారీ ÷ట్స్, రొటీన్ డైలాగ్స్ తో నింపేసారు. ఇక చివర్లో వెన్నెల కిషోర్ తో ఏదో కామెడీ అని ట్రై చేసారు. ఓవరాల్ గా చూస్తే బ్యాడ్ బాయ్ కార్తీక్ ఒక రొటీన్ కమర్షియల్ టీజర్ లానే అనిపిస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మరియు శ్రీదేవి విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా తమిల్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ హారిస్ జయరాజ్ సంగీతం అందిస్తున్నారు. నాగ శౌర్య కు జోడిగా వీధి హీరోయిన్ గా నటిస్తుండగా వైష్ణవి ఫిలింస్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు.

# మహానటిలో ఏఎన్నార్ పాత్ర నా అదృష్టం
### నటుడు నాగచైతన్య వెల్లడి



'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షూటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.



# మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు సమంత

స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రొడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షూటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.





# ఓటీటీ తెరపైకి కిష్కింధపురి

ఈ మధ్య కాలంలో థియేటర్ల దగ్గర సందడి వాతావరణం ఎక్కువగా కనిపించలేదు. చాలా తక్కువ సినిమాలు మాత్రమే 3 రోజుల తరువాత కూడా నిలబడ్డాయి. అలాంటి పరిస్థితుల్లో క్రితం నెలలో ఒకేరోజు విడుదలైన రెండు సినిమాలు, థియేటర్ల దగ్గర తమ జోరు చూపించాయి. అవి ఒకటి 'మిరాయ్' అయితే, మరొకటి 'కిష్కింధకాండ'. ఈ రెండు సినిమాలు కూడా డిఫరెంట్ జోనర్స్ నుంచి వచ్చినవే. సోషియో ఫాంటసీ నేపథ్యంలో వచ్చిన 'మిరాయ్' .. హారర్ టచ్ తో సాగే 'కిష్కింధకాండ' ఈ రెండూ కూడా ఒకే రోజున ఓటీటీ ప్రేక్షకులను పలకరించనున్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి జియో హాట్ స్టార్ లో 'మిరాయ్' స్ట్రీమింగ్ కానుండగా, అదే రోజున 'జీ 5'లో 'కిష్కింధపురి' అందుబాటులోకి రానుంది. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటించిన 'కిష్కింధపురి'లో, అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. నిజానికి పోస్టర్స్ దగ్గర నుంచే ఈ సినిమా చాలామందిలో ఆసక్తిని పెంచింది.

# నాగార్జున 100వ సినిమా 'లాటరీ కింగ్' ?



సీనియర్ హీరో అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే 100వ సినిమాను ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో 'కుబేర', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో మంచి ఊపు మీదున్న ఆయన, తన వందో ప్రాజెక్టును కూడా సెట్స్‌పైకి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ఈ చిత్రానికి 'లాటరీ కింగ్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను దాదాపు ఖరారు చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే, తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో నాగార్జున 100వ చిత్రం తెరకెక్కుతోంది. ఇది పూర్తిస్థాయి యాక్షన్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకోనుంది. నాగార్జున సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది.

Published by Goli Sammi Reddy, Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder. RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com